



# సూర్య

నేటి దినపత్రిక

www.suryaa.com

19వ వసంతంలోకి ...

ఎన్టీఆర్ కృష్ణా

బుధవారం 26 నవంబర్ 2025 పేజీలు 8


# డీఎస్సీ నియామకాల్లో....

## దొంగ సర్టిఫికెట్ల దందా నిజమేనా?

- నిజమైన వికలాంగులకు న్యాయం జరగదా?
- సమగ్రంగా పరిశీలిస్తే నిజాలు నిగ్గులోకి వస్తాయని విద్యావేత్తలు, స్థానికుల సూచన




**కృష్ణాజిల్లా స్టాఫ్ రిపోర్టర్ మేజర్ న్యూస్ :** డీఎస్సీ నియామకాల్లో దొంగ పి హెచ్ సి సర్టిఫికెట్ల దందా యదేచ్ఛగా కొనసాగడం పట్ల జిల్లాలోని ఉపాధ్యాయులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. ఎన్నో సంవత్సరాలుగా అవనిగడ్డ కేంద్రంగా కొనసాగుతున్న ఈ దందాకు అంతం లేదా? అని ప్రశ్నిస్తున్నారు. దీనివల్ల నిజమైన దివ్యాంగులు ఉద్యోగాలు కోల్పోవడం జరుగుతోందన్నారు. అర్హులైన దివ్యాంగ అభ్యర్థులకు పోస్టులు రానివ్వకుండా, అన్ని అవయవాలు సక్రమంగా పనిచేస్తున్న వారికి నకిలీ సర్టిఫికెట్లు సృష్టించి, ఉపాధ్యాయ పోస్టులు అయినవారికి అప్పనంగా పోస్ట్ లు వచ్చేలాగా జేబులో వేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**వికలాంగ సర్టిఫికెట్ల మాఫియా నిజమేనా?**

చిన్నపాటి వైకల్యం ఉన్నప్పటికీ డబ్బులు చెల్లించి,లేదా రాజకీయ పలుకుబడిని ఉపయోగించి వికలాంగ పర్సంటేజ్ ని ఎక్కువగా ఉన్నట్లు చూపించి సర్టిఫికెట్ తెచ్చుకొని యదేచ్ఛగా వికలాంగ కోటాలో ఉద్యోగం సాధిస్తున్నారని వినికిడి. ఇది క్షమించరాని నేరమని ఇలాంటి నేరాలకు అడ్డుకట్ట వేయాలని జిల్లా విద్యాశాఖ సమగ్రంగా పరిశీలించి దీనికి అడ్డుకట్ట వేయాలని మేధావి వర్గమైన ఉపాధ్యాయులు, సోషల్ వర్కర్లు కోరుతున్నారు.

**నిజమైన వికలాంగులకు న్యాయం జరగదా?**

నిజమైన వికలాంగుల నోరు కొడుతున్న నకిలీ అభ్యర్థులు

2లో



జాతీయస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకి ఎంపికైన

# సబ్బినేని ఉస్మిత

3న జరిగే ఢిల్లీలో జరిగే జాతీయస్థాయి పోటీలకు హైస్కూల్ విద్యార్థిని ఎంపికైంది

పాఠశాల ప్రధానోపాధ్యాయులు అలపర్తి సత్యనారాయణ, ఫిజికల్ డైరెక్టర్స్ గాజుల లక్ష్మీప్రసాద్ కే.శివాజీ




**నాగాయలంక నవంబర్ 25 మేజర్ న్యూస్ :** నాగాయలంక జిల్లా పరిషత్ ప్లస్ హైస్కూల్లో చదువుతున్న 8వ తరగతి విద్యార్థిని సబ్బినేని ఉస్మిత అత్యుత్తమ ప్రదర్శన కనబరిచి 69వ రాష్ట్రస్థాయి గేమ్స్ పెడరేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో సాఫ్ట్‌బాల్ పోటీలు ఉమ్మడి 13 జిల్లాల పాఠశాల విద్యార్థినిలు కడప జిల్లా పులివెందుల జిల్లా పరిషత్ మిగతా 2లో...

విద్య, వైద్య అవసరాలు ఉన్నవారికి

# బెరాకా మినిస్ట్రీస్ ఆపన్న హస్తం

- సహాయార్థులకు "మేమున్నాం" అంటున్న బెరాకా మినిస్ట్రీస్
- పేద విద్యార్థుల, విద్య, వైద్యానికి 11,10,000 రూపాయలు చేయూత
- డాక్టర్ బి ఎస్ కిరణ్ పాల్ సేవల్ని కొనియాడిన పలువురు ప్రముఖులు

వివరాలు 8లో



అమరావతికి ధీటుగా

# విజయవాడ అభివృద్ధి - పురోగతి



- రూ.2వేల కోట్ల అంచనాతో తయారవుతున్న డిపిఆర్
- 2029 నాటికి పూర్తి స్థాయి అభివృద్ధి లక్ష్యం
- ఎంపీ కేశినేని శివనాథ్ ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ వెల్లడి
- రూ.93.08 లక్షలతో డ్రెయిన్ నిర్మాణ పనులకు శంకుస్థాపన
- ముఖ్యఅతిథులుగా ఎంపీ కేశినేని శివనాథ్, ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్

**విజయవాడ మేజర్ న్యూస్ :** రాష్ట్ర రాజధాని అమరావతి అభివృద్ధి వేగానికి సరితూగేలా విజయవాడ నగరాన్ని తీర్చిదిద్దేందుకు కూటమి ప్రభుత్వం దృడ సంకల్పంతో ముందుకు సాగుతున్నదని ఎంపీ కేశినేని శివనాథ్, ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ తెలిపారు. నగర మౌలిక వసతుల సమగ్ర అభివృద్ధి లక్ష్యంగా రూ. 93.08 లక్షల వ్యయంతో తూర్పు నియోజకవర్గం 8వ డివిజన్ పాత ఐదో నెంబర్ మార్గంలో మెట్రోపాలిటన్ హోటల్ వద్ద మిగతా 2లో




# బిజినెస్ ఎక్స్ పోను విజయవంతం చేయాలి

పరిశ్రమల స్థాపనకు రాష్ట్రం ఎంతో అనుకూలం

సమాచార పౌర సంబంధాలు, గృహ నిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారథి 2

# డీఎస్సీ నియామకాల్లో దొంగ సర్టిఫికెట్ల దందా నిజమేనా?

(మొదటిపేజీ తరువాయి)

తమ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తూ తమ పలుకుబడిని, పరపతిని ఉపయోగించి దొడ్డిదారిలో అక్రమంగా ఉద్యోగాన్ని సంపాదించడం ఎంతవరకు భావ్యమని ప్రశ్నిస్తున్నామన్నారు.

**చలనం లేని జిల్లా విద్యాశాఖ..**

కోడూరు మండలంలో స్కూల్ అసిస్టెంట్, ఇంగ్లీష్ గా పనిచేస్తున్న ఒక ఉపాధ్యాయుడు 2010లో పీ హెచ్ సి కోటాలో దరఖాస్తు చేయగా, అతనికి పీ హెచ్ సి కోటాలో ఉద్యోగం రాలేదు. తదుపరి తన పలుకుబడిని పరపతిని ఉపయోగించి దొడ్డి దారిలో, 95% పీహెచ్‌సి సర్టిఫికెట్ తీసుకొని 2012 డీఎస్సీలో ఉద్యోగం సంపాదించారు. మండల డిక్టేటర్‌గా వ్యవహరిస్తున్న మండల విద్యాశాఖ అధికారే తన ముద్దుల అల్లుడి కోసం కనిపించిన ప్రతి అడ్డదారిని, తన రహదారిగా మార్చుకొని, ఏ ప్రభుత్వం ఉన్నా, ఆ ప్రభుత్వానికి భజన చేస్తూ తప్పించుకు తిరుగువాడు ధన్యుడు సుమతి! అన్న రీతిలో వ్యవహరించడం ఎంతవరకు సబబు అని ప్రశ్నిస్తున్నారు. అక్రమ మార్గంలో డి ఎస్సీ ద్వారా ఉద్యోగం సంపాదించిన ఈ ముద్దుల అల్లుడికి, మండలంలో డ్యూటీలకు కొదువ లేదు. డీఎస్సీ అభ్యర్థుల ఎంపిక డ్యూటీలు, సబ్జెక్ట్ ఎక్స్పర్ట్ డ్యూటీలు, సాంకేతిక పరిజ్ఞాన అంశాలకు సంబంధించిన డ్యూటీలు ఇలా ఒక డ్యూటీ! అని పేరు ఏమిటి? మండలంలో ఏ డ్యూటీ వేయవలసి వచ్చినా ఈ అల్లుడు గారే ప్రథమ స్థానంలో ఉంటారు. ఎందుకంటే వికలాంగ కోటలో ఉద్యోగం సాధించారు కాబట్టి..! ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు ఇప్పించడంలో 95% కళ్ళు కనిపించని ఈ ఉపాధ్యాయుడు అంత నియమబద్ధంగా, నిబద్ధతతో ఉత్తమ ఉపాధ్యాయ అభ్యర్థులను సెలెక్ట్ చేసే పరిజ్ఞానం ఉందా? అని ప్రశ్నిస్తున్నారు. మండల డిక్టేటర్ పరిస్థితి చూస్తే అయిన వారికి ఆకుల్లో, కాని వారికి కంచాల్లో అన్నట్లుగా ఉంది.

అవనిగడ్డలో ప్రసిద్ధిగాంచిన డీఎస్సీ కోచింగ్ సెంటర్ నడుస్తోంది. అంతవరకు బాగానే ఉంది. కానీ కోడూరు నాగాయలంక మండలాల్లో పనిచేసే కొంతమంది ఉపాధ్యాయులు, వివిధ అనారోగ్య కారణాలు, కుటుంబ అవసరాల నిమిత్తం దీర్ఘకాలిక సెలవులు పెట్టి అవనిగడ్డలో నడుస్తున్న కోచింగ్ సెంటర్లో డీఎస్సీ అభ్యర్థులకు శిక్షణ ఇవ్వడం ఎంతవరకు సబబు? అని ప్రశ్నిస్తున్నారు. కానీ వీరు పని చేస్తున్న పాఠశాలలో విద్యా వాలంటీర్లతో పాఠశాలలను నడుపుతున్నారు. వారు అందుబాటులో లేకపోతే సీఎల్, ఆర్జిత సెలవు, మెడికల్ లీవు తదితర సెలవులు వాడి, వారు పని చేస్తున్న పాఠశాలలో ఠంచనుగా జీతాలు పొందడం గమనార్హం అని ఉపాధ్యాయులు గుసగుసలాడుకుంటున్నారు. మండల "ముద్దుల అల్లుడు" గా భావించే సదరు ఉపాధ్యాయుడు ప్రతిరోజూ తన సొంత బైక్ వేసుకుని పాఠశాలకు వెళుతుండడం గమనార్హం. 95% వికలాంగ కోటలో ఉద్యోగం పొందిన సదరు ఉపాధ్యాయుడు బైకు పై ప్రయాణం చేయడం,ఎలా సాధ్యం? అని ఉపాధ్యాయ లోకం ప్రశ్నిస్తోంది.

అంతేకాకుండా ఒక యూనియన్ ని భుజాన వేసుకొని అడ్డగోలుగా వారికి అన్ని రకాలుగా సహకరిస్తున్న కోడూరు మండల విద్యాశాఖ అధికారి 95% కళ్ళు కనిపించని ఉపాధ్యాయుడిని వెనకేసుకు రావడం ఎంతవరకు సబబు అని ప్రశ్నిస్తున్నారు. నూతన డీఎస్సీ ఉపాధ్యాయులకు ఇటీవల పామర్రులో జరిగిన ట్రైనింగ్ సెంటర్ కు ట్రైనింగ్ ఇవ్వడానికి పంపించడం జరిగింది. అదేవిధంగా కోడూరు మండల స్థాయిలో అన్ని పాఠశాలల పరిశీలనకు సబ్జెక్టు ఎక్స్పర్ట్ గా ఇదే ఉపాధ్యాయుడిని నియమించడం జరిగింది. అనేక అక్రమాలకు పాల్పడుతున్న కోడూరు మండల విద్యాశాఖాధికారి నిరంకుశ, నియంత్రత్వ, విచ్చలవిడి పరిపాలనకు ఇదొక నిదర్శనం అని ఉపాధ్యాయ లోకం అంటోంది.

కాబట్టి అందత్వ సర్టిఫికెట్ తో ఉద్యోగం పొంది, కోడూరు మండలంలో పనిచేస్తున్న సదరు ఇంగ్లీష్ ఉపాధ్యాయుని అందత్వ శాతాన్ని మరోసారి పరిశీలించాలని గుసగుసలాడుకుంటున్నారు. అంతేకాకుండా ఇదేవిధంగా కొంత మంది దివిసీమ వాసులు దొంగ సర్టిఫికెట్ తీసుకుని ఉపాధ్యాయ ఉద్యోగం సంపాదించి ఇప్పటికీ ఉద్యోగాలు కొనసాగిస్తున్నారని వినికిడి. ఈ సర్టిఫికెట్లు నిజంగా యదార్థం అయినవా? లేక దొంగ సర్టిఫికెట్లో మరోసారి సమగ్రంగా పరిశీలించాలని, నిజాలను నిగ్గులోకి తీసుకురావాలని జిల్లా విద్యాశాఖను స్థానికులు కోరుతున్నారు.

(మొదటిపేజీ తరువాయి)

## జాతీయస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకి ఎంపికైన సబ్బినేని ఉస్మిత



ఉన్నత పాఠశాలలో పాల్గొనగా అత్యుత్తమ ప్రదర్శన కనబరిచిన సబ్బినేని ఉస్మిత ఉమ్మడి కృష్ణాజిల్లా నుండి 2026 జనవరి 3న జరిగే ఢిల్లీలో జరిగే జాతీయస్థాయి పోటీలకు ఎంపిక కాబడినట్లుగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు అలపర్తి సత్యనారాయణ, ఫిజికల్ డైరెక్టర్స్ గాజుల లక్ష్మీప్రసాద్ కే.శివాజీ తెలియజేశారు. ఎంపిక కాబడిన సబ్మినేని ఉస్మిత మీడియా వారి తో మాట్లాడుతూ సహకరించిన తల్లిదండ్రులకు సాఫ్ట్‌బాల్ క్రీడను నేర్పిన డ్రిల్ మాస్టర్‌కి ధన్యవాదాలు తెలిపారు. ముఖ్యంగా మన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకి, ఉప ముఖ్యమంత్రి కొనిదెల పవన్ కళ్యాణ్‌కి, విద్యా శాఖ మంత్రి నారా. లోకేష్ బాబుకి అవనిగడ్డ నియోజకవర్గ శాసనసభ్యులు మండలి బుద్ధ ప్రసాద్‌కి అవనిగడ్డ నియోజకవర్గ పరిశీలకులు కనపర్తి శ్రీనివాసరావుకి తనుకు సహకరించిన పెద్దలకు గురువులకు నమస్కారాలు తెలుపుతూ, ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వమునకు జాతీయ స్థాయిలో గుర్తింపు తీసుకొచ్చే విధముగా శ్రమించి శాయశక్తుల శ్రమించి జాతీయస్థాయిలో రాష్ట్ర ప్రభుత్వానికి మంచి పేరు తీసుకుని వస్తానని అందరూ ఆశీస్సులు అందజేయమని మీడియా పూర్వకంగా తెలియజేశారు.

## అమరావతికి ధీటుగా విజయవాడ అభివృద్ధి - పురోగతి

వెయ్యి మీటర్ల డ్రెయిన్ నిర్మాణ పనులకు మంగళవారం ఎంపీ కేశినేని శివనాథ్, ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ శంకుస్థాపన చేశారు. ఎంపీ కేశినేని శివనాథ్, ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ లకు స్థానిక నాయకులతో కలిసి కార్పొరేటర్ చెన్నుపాటి ఉషారాణి ఘన స్వాగతం పలికారు. వర్షపు నీటి డ్రైను నిర్మాణ పనులకు కొబ్బరికాయలు కొట్టి శంకుస్థాపన చేశారు. అనంతరం శిలాఫలకం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎంపీ కేశినేని శివనాథ్ మాట్లాడుతూ విజయవాడ నగరాన్ని పూర్తిస్థాయిలో మార్చేందుకు సీఎం నారా చంద్రబాబు నాయుడు ప్రత్యేక ప్రణాళిక రూపొందించారని, స్ట్రామ్‌వాటర్, అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ, తాగునీటి సరఫరా వ్యవస్థలను సమూలంగా మెరుగుపరచాలని ఆదేశించినట్లు తెలిపారు. ఈ లక్ష్యంతో నగర పాలక సంస్థ ఆధ్వర్యంలో సుమారు రూ.2,000 కోట్ల డిపీఆర్ సిద్ధమవుతోందని వివరించారు. ఈ ప్రణాళిక అమలు అయితే నగరంలో వర్షం పడినప్పుడు చుక్క నీరు కూడా రోడ్డు మీద నిల్వ ఉండకుండా నగరానికి శాశ్వత పరిష్కారం లభిస్తుందని, కొండప్రాంతాల్లో కూడా మంచి నీటి సరఫరా జరుగుతుందని తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ప్రత్యేక నిధులతో పెద్దఎత్తున రోడ్లు, డ్రెయిన్ నిర్మాణాలు చేపట్టడం జరిగిందన్నారు. అనంతరం ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ మాట్లాడుతూ నగర అభివృద్ధిని సమగ్రంగా తీర్చిదిద్దేందుకు ఎంపీ కేశినేని శివనాథ్ సహకారంతో డిపీఆర్ సిద్ధమవుతున్నదని, వచ్చే రెండేళ్లలో మొత్తం రోడ్లను, ప్రధాన డ్రెయిన్ వ్యవస్థలను, స్ట్రామ్‌వాటర్ లైన్లను, అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థను పూర్తిగా పునరుద్ధరించే దిశగా చర్యలు జరుగుతున్నాయని తెలిపారు. విజయవాడ రాజధాని ప్రాంతంగా ప్రకటించబడిన తర్వాత కనకదుర్గమ్మ ఫ్లైఓవర్, బెంజ్ సర్కిల్ ఫ్లైఓవర్ వంటి అనేక ప్రాజెక్టులు అమలయ్యాయి. అయితే మధ్యలో వచ్చిన ఐదేళ్ల గ్యాప్ ద్వారా రాష్ట్రంలో ఎంత వినాశం, ఎంత విధ్వంసం జరిగిందో అందరికీ తెలుసునన్నారు. ఈ ఐదేళ్ల గ్యాప్‌లో నగరం ఎదుర్కొన్న సమస్యలను ఇప్పుడు ప్రణాళికాబద్ధంగా పూడ్చి మళ్లీ అభివృద్ధి పథంలోకి తీసుకువస్తున్నామని తెలిపారు. 2029 నాటికి విజయవాడను అన్ని విధాలుగా పరిశుభ్రంగా, ఆధునికంగా, దేశంలో ఆదర్శ నగరంగా మార్చాలన్న లక్ష్యంతో సీఎం చంద్రబాబు నాయుడు మార్గదర్శకత్వంలో అడుగులు వేస్తున్నామని స్పష్టం చేశారు.ఇందుకు సంబంధించి ఎంపీ కేశినేని శివనాథ్, విజయవాడ ఎమ్మెల్యేల సలహాలు సూచనలతో ముందుకు వెళుతున్నట్లు తెలిపారు. కార్పొరేటర్ చెన్నుపాటి ఉషారాణి మాట్లాడుతూ తన డివిజన్ అభివృద్ధి విషయంలో అన్ని విధాలుగా సహాయ సహకారాలు అందిస్తున్న ఎంపీ కేశినేని శివనాథ్,ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ లకు కృతజ్ఞతలు తెలిపారు. ఎన్డీయే కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రంలోని అన్ని నియోజకవర్గాల్లో ప్రతి నిత్యం అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు జరుగుతున్నాయన్నారు. డివిజన్ అభివృద్ధి పనులకు స్థానికులు, నివాసితులు అందిస్తున్న సహకారం మరువలేనిదన్నారు. ఈ కార్యక్రమంలో 8వ డివిజన్ ప్రెసిడెంట్ కొత్తపల్లి రమేష్, క్లస్టర్ ఇన్చార్జ్ సొంగా సంజయ్ వర్మ, శాలివాహన సంక్షేమ అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ పేరిపి ఈశ్వర్, డివిజన్ మాజీ ప్రధానకార్యదర్శి మల్లెల రామకృష్ణ, బూత్ కన్వీనర్లు మండవ దుర్గా భవానీ, కర్ర సురేష్, రమణి, మాజీ డివిజన్ అధ్యక్షుడు మెరకనపల్లి నాగేశ్వరరావు, టిడిపి జిల్లా ఉపాధ్యక్షుడు చలసాని రమణ, టిడిపి లీగల్ సెల్ నాయకులు యెర్నేని వేదవ్యాస్, టి.ఎన్.టి.యు.సి జిల్లా కార్యదర్శి బద్దూరి వీరారెడ్డి, జిల్లా ఎస్సీ సెల్ కార్యదర్శి దోమకొండ రవి, టి.ఎన్.ఎస్.ఎఫ్ రాష్ట్ర నాయకులు రేపాకుల శ్రీనివాస్, సర్కిల్ 3 ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సామ్రాజ్యం, డి.ఈ శాంత కుమార్, స్థానికులు అరుణ, సురేంద్ర, నాగేశ్వరరావు, మనోహర్ ప్రసాద్, జగదీష్, శివయ్య లతో పాటు తదితరులు పాల్గొన్నారు.

# పారిశుధ్య నిర్వహణలో ఎటువంటి లోపం ఉండరాదు





**విజయవాడ కార్పొరేషన్, మేజర్ న్యూస్ :** పారిశుధ్య నిర్వహణలో ఎటువంటి లోపం ఉండరాదని విజయవాడ నగర పాలక సంస్థ కమిషనర్ ధ్యాన చంద్ర హెచ్ యం అన్నారు. మంగళవారం ఉదయం ప్రధాన కార్యాలయంలోని తమ చాంబర్లో సంబంధిత శాఖాధిపతులతో పారిశుధ్య నిర్వహణపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పారిశుధ్య నిర్వహణలో ఎటువంటి లోపం ఉండరాదని, నగరం పరిశుభ్రంగా ఉంచాలని, వ్యర్థాలు ఎప్పటికప్పుడు సేకరించాలని, సేకరించిన వ్యర్థాలను ఎప్పటికప్పుడు జిందాల్కు తొలగించాలని, రహదారులు పరిశుభ్రంగా ఉండాలని, ప్రధాన రహదారుల్లో ఏమైనా మరమ్మతులు ఉన్నచో వెంటనే వాటిని పూర్తి చెయ్యాలని, గుంతలు లేకుండా ప్యాచ్ వర్క్‌లు ఎప్పటికప్పుడు పూర్తి చెయ్యాలని, నగర ప్రజలకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా అభివృద్ధి కార్యక్రమాలైనా, పారిశుధ్య నిర్వహణైనా సజావుగా జరగాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ కె. అర్జునరావు, పర్యవేక్షణ ఇంజనీర్ (వర్క్స్ )ఏ. శ్రీనివాసరెడ్డి, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు, అసిస్టెంట్ మెడికల్ హెల్త్ ఆఫీసర్లు, సానిటరీ సూపర్వైజర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

# బిజినెస్ ఎక్స్ పోను విజయవంతం చేయాలి



**విజయవాడ, మేజర్ న్యూస్ :** డిసెంబర్ 12,13,14 తేదీల్లో ఏపీ చాంబర్స్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ ఫెడరేషన్ ఆధ్వర్యంలో బిజినెస్ ఎక్స్ పో ను నిర్వహిస్తున్నట్లు సమాచార పౌర సంబంధాలు, గృహ నిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారథి తెలిపారు. ఏపీ చాంబర్స్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ ఫెడరేషన్ ఆధ్వర్యంలో డిసెంబర్ 12 నుండి 14 తేదీల్లో మూడు రోజుల పాటు విజయవాడ ఎస్ ఎస్ కన్వెన్షన్ లో నిర్వహించనున్న బిజినెస్ ఎక్స్ పో కు సంబంధించిన బ్రోచర్, ఏపీ లోగో ను లాంఛనంగా మంగళవారం గుణదలలోని హోటల్ హయత్ లో విడుదల చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మంత్రి కొలుసు పార్థసారథి హాజరై మాట్లాడుతూ రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టే పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సానుకూలతతో ముందుకు వెళ్లుతుందన్నారు. శాంతియుత వాతావరణంలో రాష్ట్రంలో పెట్టుబడులను ఆకర్షించేందుకు రాష్ట్రంలో పెట్టేందుకు ముందుకు వచ్చే వారి కోసం అనేక రాయితీలతో కొత్తగా పారిశ్రామిక పాలసీలను ప్రభుత్వం అమల్లోకి తీసుకొచ్చిందన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సారథ్యం లో కూటమి ప్రభుత్వం రాష్ట్రానికి పెట్టుబడులను తీసుకొచ్చేందుకు అహర్నిశలు కృషి చేస్తుందన్నారు. పెట్టుబడులు తీసుకొచ్చేందుకు ప్రతి ఒక్కరూ కలిసి పనిచేయాలని ముఖ్యమంత్రి పిలుపినిచ్చారని ఈ నేపథ్యంలో ఏపీ చాంబర్స్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ ఫెడరేషన్ ముందుకు రావడం అభినందనీయమన్నారు. నూజివీడు లాంటి అభివృద్ధి చెందుతున్న పట్టణాల్లో పరిశ్రమల స్థాపనకు అనేక సానుకూల అంశాలు, మౌలిక వసతులు అందుబాటులో ఉన్నాయని, ఆ ప్రాంతంలో పెట్టుబడులు పెట్టేందుకు పారిశ్రామిక వేత్తలు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. బిజినెస్ ఎక్స్ పో ను పారిశ్రామిక వేత్తలు, వ్యాపారులు, ప్రజలు సద్వినియోగం చేసుకుని రాష్ట్రంలో పెట్టుబడుల ప్రవాహాన్ని పెంచేలా విజయవంతం చేయాలని దీనికి రాష్ట్ర ప్రభుత్వం సంపూర్ణ మద్దతు అందిస్తుందని మంత్రి పార్థసారథి పేర్కొన్నారు.

**బిజినెస్ ఎక్స్ పో ప్రత్యేకతలు :** గత సంవత్సరం బిజ్ నెస్ ఎక్స్ పో కంటే మెరుగ్గా ఈ ఏడాది నిర్వహించనున్నారు. ఈ వేదిక ద్వారా కొత్త ఉత్పత్తులను ఆవిష్కరించడం, పర్యాటక రంగం, ఫుడ్ ప్రాసెసింగ్, హాస్పిటాలటీ వంటి సెక్టార్స్ ఉంటాయన్నారు. సెమినార్ల నిర్వహణ ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తుందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అనేకరకాల ఉత్పత్తులను ఈ వేదిక ద్వారా ప్రమోట్ చేయనున్నారు. ప్రతి రోజూ సాయంత్రం అనేక రకాల సాంస్కృతిక కార్యక్రమాలు ప్రత్యేక ఆకర్షణగా నిలవనున్నాయి. కార్యక్రమంలో ఏపీ చాంబర్స్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ ఫెడరేషన్ అధ్యక్షులు పొట్లూరి భాస్కరరావు, జనరల్ సెక్రటరీ రావూరి సుబ్బారావు, కోశాధికారి ఎస్. అక్కయ్య నాయుడు, ఏపీ స్టార్ హోటల్స్ అసోసియేషన్ అధ్యక్షులు ఆర్వీ స్వామి, తదితరలు పాల్గొన్నారు.

# ఎంఎస్ఎంఈలను బలోపేతానికి ప్రభుత్వంతో వాల్‌మార్ట్ వృద్ధి ఎంఓయూ




**విజయవాడ మేజర్ న్యూస్ :** వాల్‌మార్ట్ వృద్ధి, దాని ప్రోగ్రామ్ భాగస్వామి ' ఐడియాస్ టు ఇంపాక్ట్ ఫౌండేషన్' ద్వారా, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ పరిశ్రమలు & వాణిజ్య శాఖతో ఒక అవగాహన ఒప్పందం (ఎంఓయు)పై సంతకం చేసింది. వాల్‌మార్ట్ వృద్ధి ద్వారా రాబోయే మూడు సంవత్సరాలలో ఉచిత శిక్షణ, వ్యక్తిగతీకరించిన మార్గదర్శకత్వంతో రాష్ట్ర ఎంఎస్ఎంఈ పర్యావరణ వ్యవస్థను బలోపేతం చేయడానికి ఈ ఒప్పందం సహాయపడనుందని వాల్‌మార్ట్ ఇంటర్నేషనల్ సోర్సింగ్, సప్లయర్ డెవలప్మెంట్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ జాసన్ ఫ్రెమ్‌స్టాడ్ అన్నారు. విశాఖపట్నంలో జరిగిన సిఐఐ భాగస్వామ్య సదస్సు 2025లో జరిగిన నిర్ణయం మేరకు తాజాగా ఈ అవగాహన ఒప్పందం చేసుకున్నామన్నారు. 2028 నాటికి అదనంగా 100,000 ఎంఎస్ఎంఈలను శక్తివంతం చేయడానికి వాల్‌మార్ట్ వృద్ధి ప్రయత్నాలలో ఒక ముఖ్యమైన ముందడుగును సూచిస్తుందన్నారు. ఈ కార్యక్రమం ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా మాస్టర్‌క్లాస్‌లు, వర్క్‌షాప్‌లను నిర్వహించనుందని, ఫ్లిప్‌కార్ట్, వాల్‌మార్ట్ మార్కెట్‌ప్లేస్ వంటి దేశీయ, అంతర్జాతీయ ఇ కామర్స్ ప్లాట్‌ఫామ్‌లలోకి ఎంఎస్ఎంఈలు చేరటానికి, తమ వ్యవస్థలను ఆధునీకరించడానికి, వ్యాప్తి చెందటానికి, విస్తరించడానికి అవసరమైన సాధనాలతో వాటిని సన్నద్ధం చేయడం లక్ష్యంగా పెట్టుకుందన్నారు. ఏపి ఎంఎస్ఎంఈ, ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ డెవలప్‌మెంట్ పాలసీ (2024–29) – ఒక కుటుంబం, ఒక వ్యవస్థాపకుడు కింద ఎంఎస్ఎంఈ వృద్ధికి ప్రాధాన్యత ఇవ్వాలనే ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ లక్ష్యంకు అనుగుణంగా ఈ కార్యక్రమం 2030 నాటికి వ్యవస్థాపక గృహ సంస్కృతిని నిర్మించే లక్ష్యానికి తోడ్పడనుందని చెప్పారు. ఈ అవగాహన ఒప్పందం పట్టు, దుస్తులు, ఆహార ప్రాసెసింగ్ (జీడిపప్పు, కాఫీ, సుగంధ ద్రవ్యాలు సహా), ఆభరణాలు, కృత్రిమ వజ్రాలు, ఇత్తడి వస్తువులు, కొబ్బరి పీచు, ఇంజనీరింగ్, హస్తకళలు, చెక్క ఫర్నిచర్ వంటి ప్రాధాన్యతా క్లస్టర్‌లపై దృష్టి పెడుతుందని అన్నారు. విశాఖపట్నం, గుంటూరు, కృష్ణాతో సహా జిల్లాల్లో ఈ విస్తరణ ప్రారంభమవుతుందని, తరువాత అనంతపురం, తూర్పు, పశ్చిమ గోదావరి, నెల్లూరు, కర్నూలు, చిత్తూరు, ప్రకాశం వరకు విస్తరిస్తుందని తెలిపారు.

# ఎస్సీ ఎస్టీ యూఎస్ రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులుగా వెంకటేశ్వర్లు, రాజేంద్ర





**విజయవాడ మేజర్ న్యూస్ :** ఎస్సీ ఎస్టీ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర నూతన కార్యవర్గ ఎన్నిక మంగళవారం సంఘ వ్యవస్థాపక జాతీయ అధ్యక్షులు కొమ్మల బాబు, ప్రధాన కార్యదర్శి కోలా ప్రసాద్ ఆధ్వర్యంలో జరిగింది. ఈ ఎన్నికల్లో రాష్ట్ర అధ్యక్షునిగా చందోలు వెంకటేశ్వర్లు,ప్రధాన కార్యదర్శిగా మద్ది బాబు రాజేంద్రప్రసాద్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యారంగంలో అపరిష్కృతంగా ఉన్న సమస్యల పరిష్కారానికి తమ సంఘం తరఫున కృషి చేస్తామని తెలియజేశారు ఎస్సీ ఎస్టీ ఉపాధ్యాయుల ఉన్నత చదువుల కోసం రాజ్యాంగ స్ఫూర్తితో జారీ చేయబడిన జీవో నెంబర్ 342 సక్రమంగా అమలయ్యేలా చర్యలు తీసుకోవాలని, ఎస్సీ ఎస్టీ ఉపాధ్యాయుల ఉన్నత విద్యా అవకాశాలను ఆటంకపరచకుండా అనుమతులు ఇవ్వాలని ఈ సందర్భంగా కోరారు. పాయకరావుపేట మండలం రాజానగరం పాఠశాలలో జరిగిన ప్రమాదంలో మరణించిన ఉపాధ్యాయిని జోత్స్నాబాయి కుటుంబాన్ని ఆదుకోవాలని కోరారు. 2003 డిఎస్సి వారికి మెమో 57 అమలు చేసి పాత పెన్షన్ తక్షణం వర్తింప చేయాలని కోరారు. 30 శాతం ఐ ఆర్ ప్రకటించి, పి ఆర్ సి ని నియమించాలని కోరారు. పెండింగ్ డిఏలు, బకాయిలు చెల్లించాలని కోరారు. కారుణ్య నియామకాలు చేపట్టి కోవిడ్ సమయంలో మరణించిన ఉపాధ్యాయుల కుటుంబాలను ఆదుకోవాలని పేర్కొన్నారు. విద్యార్థుల విద్యా ప్రమాణాలను ప్రభావితం చేస్తున్న బోధనేతర కార్యక్రమాలు నుండి ఉపాధ్యాయులను మినహాయించాలని, ఉద్యోగం చేస్తున్న ఉపాధ్యాయులకు టెట్ పరీక్ష నుండి మినహాయించేలా చట్ట సవరణ చేయాలని ఈ సమావేశంలో వారు కోరారు.

# అంగన్వాడీ కేంద్రాలను పరిశీలించిన ప్రాజెక్ట్ డైరెక్టర్

**అవనిగడ్డ, మేజర్ న్యూస్ :** మండలంలోని అంగన్వాడీ కేంద్రాలను ఐసిడిఎస్ ప్రాజెక్ట్ డైరెక్టర్ ఎం ఎన్ రాణి ఆకస్మిక తనిఖీలు చేసి పరిశీలించారు. మంగళవారం అవనిగడ్డ లోని 06 అంగన్వాడి సెంటర్ తిప్పపాలెం అంగన్వాడి సెంటర్‌ను ఐసిడిఎస్ అధికారులు ఆకస్మిక తనిఖీలు చేసి రికార్డులను పరిశీలించారు. పిల్లల గ్రోత్, బరువు లను తనిఖీ చేశారు. టి హెచ్ ఆర్, ఫుడ్ నిల్వలను క్షుణ్ణంగా పరిశీలించడం జరిగింది. అనంతరం ఆమె మాట్లాడుతూ ప్రతి అంగన్వాడీ సెంటర్ పరిసరాలు పరిశుభ్రం గా ఉండాలని, టాయిలెట్లు క్లీన్‌గా ఉండాలని అన్నారు. పిల్లలు పరిశుభ్రతను పాటించే విధానం సూచించారు. పిల్లలకు ఆటపాటలతో కూడిన విద్య నేర్పించాలన్నారు ప్రతి అంగన్వాడి సెంటర్‌లో తప్పనిసరిగా 90%పైగా అటెండెన్స్ ఉండాలన్నారు 3 సంవత్సరముల నుండి 5 సంవత్సరముల వరకు అంగన్వాడీ సెంటర్‌లోనే ఉండాలన్నారు. ఈ తనిఖీలలో భాగంగా మండలసెక్టార్ సూపర్వైజర్ ఎండి



షాహిద్ బేగం, అంగన్వాడీ కార్యకర్త పీజీ లక్ష్మి, హెల్పర్ జుబేదా బేగం తదితరులు ఉన్నారు.

# ఉప విద్యాశాఖాధికారి ఆకస్మిక సందర్శన....





**జగ్గయ్యపేట, నవంబర్ 25, మేజర్ న్యూస్ :** మండలంలో గౌరవరం గ్రామంలో మంగళవారం నందిగామ ఉప విద్యాశాఖ అధికారి ఏ. శ్యామసుందరరావు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఆకస్మిక సందర్శన చేశారు. ఈ సందర్భంగా పదో తరగతి విద్యార్థుల ఎస్ ఏ వన్ మార్కులు వివరాలు తెలుసుకొని సీ గ్రేడ్, డి గ్రేడ్ విద్యార్థులకు పదోతరగతి ఉత్తీర్ణతపై సూచనలు చేయడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వెనుకబడిన విద్యార్థులను ఉపాధ్యాయులు దత్తత తీసుకొని ప్రత్యేక శ్రద్ధ చూపి వారు కూడా పదవ తరగతి ఉత్తీర్ణత సాధించే విధంగా చర్యలు తీసుకోవాలని ఆయన అన్నారు. విద్యార్థులకు సామర్థ్యాలపై పట్టు సాధించుట కొరకు సూచనలు చేయడం జరిగిందన్నారు. పదవ తరగతి పాస్ అయ్యే వరకు సెల్ ఫోన్ కు దూరంగా ఉండాలని సూచించారు. చెడు అలవాట్లకు చెడు స్నేహితులకు దూరంగా ఉండాలని బాగా చదువుకొని తల్లిదండ్రులను కుటుంబాన్ని మన చుట్టూ ఉన్న సమాజాన్ని చక్కగా చూసుకోవాలని ఆయన సూచించారు. అనంతరం ఉపాధ్యాయులతో సమావేశమై పదవ తరగతి ఉత్తీర్ణతపై, సి,డి గ్రేడ్ విద్యార్థులకు ప్రత్యేక తరగతులు, వందరోజుల కార్యక్రమం నిర్వహించాలని రాబోయే డిసెంబర్ 5న పేరెంట్స్ టీచర్స్ సమావేశమును సక్సెస్ చేయాలని ప్రభుత్వ కార్యక్రమాలను జయప్రదం చేయాలని ఆయన కోరారు. అనంతరం మిడ్ డే మీల్స్ స్టాకు రిజిస్టర్ను పరిశీ పరిశీలించి స్టాక్ ను సరిపోల్చుకొని సంతృప్తిని వ్యక్తం చేశారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలని ప్రధానోపాధ్యాయులకు, ఉపాధ్యాయులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు జి. సూర్యకుమారి,ఉపాధ్యాయులు మహేశ్వర వెంకటేశ్వరరావు, శంకర్, రాజేష్ శారద, శ్రావణి, పుష్ప, కవిత, వెన్నెల, గౌస్య తదితరులు పాల్గొన్నారు.




## మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్ బ్రైడ్స్ ఆఫ్ ఇండియా 15వ ఎడిషన్ ప్రచారం ప్రారంభం

**విజయవాడ మేజర్ న్యూస్ :** ప్రపంచంలో అతిపెద్ద బంగారు, వజ్రాభరణాల రిటైల్ వ్యాపార సంస్థల్లో ఒకటిగా ప్రఖ్యాతిగాంచిన మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్, భారతదేశ గొప్ప సాంస్కృతిక వైభవంలో వివాహాభరణాల ప్రాముఖ్యతను ఎప్పటి నుండో అర్థం చేసుకుంటూ ఉన్నది. ప్రతి వధువు సంప్రదాయాన్ని గౌరవిస్తూ, స్వచ్ఛత, నిష్ఠ, నైపుణ్యం కలబోసి, ఎంతో శ్రద్ధగా ఎంపిక చేసిన, ప్రత్యేక డిజైన్లతో రూపొందించిన వివాహాభరణాలను అందిస్తుంది మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్. దేశంలోని అన్ని ప్రాంతల వధువుల ప్రత్యేక సంప్రదాయాలను గౌరవించేలా, అత్యంత నైపుణ్యంతో, సాటిలేని ఆభరణాలను తీర్చిదిద్దడంలో, అపూర్వమైన వారసత్వాన్ని సృష్టించింది మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్. ఒక ప్రధాన మైలురాయిని నమోదు చేస్తూ, అత్యంత ప్రతిష్టాత్మకమైన 'బ్రైడ్స్ ఆఫ్ ఇండియా' 15వ ఎడిషన్ ప్రచారాన్ని ఆవిష్కరించింది. ఈ ఏడాది ఈ ఎడిషన్‌లో మొత్తం 22 మంది వధువులు, 10 మంది ప్రముఖులు.. ఎన్టీఆర్, కార్తి, ఆలియా భట్, కరీనా కపూర్ ఖాన్, అనిల్ కపూర్, శ్రీనిధి శెట్టి, రుక్మిణి మైత్ర, సబ్యసాచి మిశ్రా, ప్రార్థన బెహెరే, మనసి పారేఖ్ పాల్గొనడంతో, ఈ ప్రచార స్థాయి, వైవిధ్యం, భావోద్వేగ గాఢత ప్రతిబింబిస్తాయి.

## సంస్మరణ సభలో పాల్గొన్న లంక లితీష్



**జి.కొండూరు మేజర్ న్యూస్ :** ఎన్టీఆర్ జిల్లా మైలవరం వడ్డెర సంఘం నేత తమ్మిశెట్టి రాము తల్లి, తమ్మిశెట్టి జమలయ్య నాయనమ్మ తమ్మిశెట్టి జమలమ్మ సంస్కరణ కార్యక్రమం మంగళవారం నిర్వహించారు ఈ కార్యక్రమానికి హాజరైన లంక లతీష్ (నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షుడు), తెదేపా నాయకులు చిత్రపటానికి పుష్పములు సమర్పించి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి దూరు బాలకృష్ణ జల్లి కృష్ణ (హాస్పిటల్ కమిటీ డైరెక్టర్), బుడిబుడి వెంకట్రావు, ఓరుగు వెంకటేశ్వరరావు (సొసైటీ డైరెక్టర్), నూతక్కి సతీష్ పాల్గొన్నారు.

## బలరాం రెడ్డి పార్థివ దేహానికి నివాళులార్పించిన రాష్ట్ర కార్యదర్శి



**జి.కొండూర్ మేజర్ న్యూస్ :** జి కొండూరు మండలం, చెవుటూరు గ్రామ వైఎస్ ఆర్ కాంగ్రెస్ పార్టీ మాజీ పార్టీ ప్రెసిడెంట్ గుడూరు బలరామ్ రెడ్డి మరణించగా ఆయన పార్థివ దేహాన్ని సందర్శించి, నివాళులార్పించి నకాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వేములకొండ తిరుపతిరావు వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలుపుతూ వారి కుటుంబానికి వైఎస్ఆర్సిపి అండగా ఉంటుందని ఆయన భరోసా ఇచ్చారు ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్సిపి నాయకులు వారి కుటుంబ సభ్యులు బంధువులు పాల్గొన్నారు

## మణిమ్మకు నివాళులర్పించిన మాజీ ఎమ్మెల్యే కైలే



**పమిడిముక్కల మేజర్ న్యూస్ :** మండల పరిధిలోని మేడూరు గ్రామంలో పాస్టర్ కొండవీటి కృష్ణారావు తల్లి కొండవీటి మణిమ్మ అనారోగ్యం కారణంతో స్వర్గస్తులు కాగా మంగళవారం పామర్రు నియోజకవర్గ మాజీ శాసన సభ్యులు కైలే అనిల్ కుమార్ ఆమె పార్థివదేహాన్ని సందర్శించి నివాళులు అర్పించారు. వారి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతి తెలియజేసారు. ఈ కార్యక్రమంలో అనిల్ కుమార్ తో పాటు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి చెందిన పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## 200 మందికి అన్నదానం

**హనుమాన్ జంక్షన్ మేజర్ న్యూస్ :** స్థానిక అభయాంజనేయ స్వామి దేవస్థానంలో 200 మంది భక్తులకు అన్న సమారాధన కార్యక్రమం నిర్వహించారు. అన్నప్రసాద వితరణకి దాతలు ఏలూరు కు చెందిన కాలే శ్రీనివాస కుమార్ శివ జ్యోతి దంపతులు సహకారం అందించారు. అన్నప్రసాద వితరణకి సహకరించిన దాతలు పేర్లపై అర్చకులు స్వామి వారి ఆలయం లో ప్రత్యేక పూజలు నిర్వహించి ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో పి.తారకేశ్వరావు చైర్మన్ వేమూరి శ్రీనివాసరావు, ధర్మకర్త మండలి సభ్యులు, ఆలయ సిబ్బంది, సేవా బృంద సభ్యులు పాల్గొని సేవలు అందించారు.

## నూతన వధూవరుని ఆశీర్వదించిన జంపాల



**జి కొండూరు మేజర్ న్యూస్ :** మొండితోక వారి వివాహ వేడుకల్లో పాల్గొన్న తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి జంపాల సీతారామయ్య పాల్గొన్నారు. ఇబ్రహీంపట్నం మండలం కాచవరం గ్రామ వాస్తవ్యులు తెలుగుదేశం పార్టీ మాజీ సర్పంచ్, మొండితోక వెంకటరత్నం ఉమాలక్ష్మి కుమార్తె ప్రత్యూష వివాహ వేడుక మంగళవారం నాడు జరిగింది. ఈ వివాహ వేడుకల్లో పాల్గొన్న జంపాల సీతారామయ్య నూతన వధూవరును ఆశీర్వదించారు. వారికి, వారి కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక పార్టీ నేతలు పాల్గొన్నారు

## టీడీపీ ఆవిర్భావం నుండి పార్టీ అభ్యున్నతికి యనమదల సేవలు నిరుపమానయం



**హనుమాన్ జంక్షన్ మేజర్ న్యూస్ :** గ్రామీణ ప్రాంతాల్లో టీడీపీ ఆవిర్భావం నుండి పార్టీ అభ్యున్నతికి యనమదల వెంకయ్యారావు అందించిన సేవలు నిరుపమానమని తెలుగురైతు రాష్ట్ర కార్యదర్శి గుండపనేని ఉమావరప్రసాద్ అన్నారు. బాపులపాడు మండలం మల్లవల్లి గ్రామంలో యనమదల వెంకయ్యారావు నివాసంలో మంగళవారం ఆయన జన్మదిన సందర్భంగా వేదాశీర్వచనంతో కూడిన సత్కారాన్ని అందజేశారు. ఉన్నత విద్యనభ్యసించినా ప్రజాసేవలపై మక్కువతో మాజీ సర్పంచ్ గ్రామాభివృద్ధికి వెంకయ్యారావు అందించిన సేవలను పలువురు కొనియాడారు. క్యాన్సర్ నుండి కోలుకుని ప్రజాసేవలోకి అడుగుపెడుతున్న వెంకయ్యారావు పార్టీ బలోపేతానికి కృషి చేయాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు మండాది రవీంద్ర, కల పాల రాధాకృష్ణమూర్తి, అక్కినేని మాణిక్యాలరావు, తదితరులు పాల్గొన్నారు.

## పంచాయతీ కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయాలి

**జి.కొండూరు మేజర్ న్యూస్ :** ఇబ్రహీంపట్నం మండలం గుంటుపల్లి గ్రామ పంచాయతీ కార్మికులకు కనీస వేతనం 18 వేలు అమలు చేయాలని, పిఎఫ్ ఇయస్ఐ చట్టబద్ద సౌకర్యాలు కల్పించాలని సిఐటియు ఇబ్రహీంపట్నం మండల కార్యదర్శి యం మహేష్ డిమాండ్ చేశారు. సమాన పనికి సమాన వేతనం తో పాటు యేళ్ళ తరబడి పనిచేస్తున్న గ్రామ పంచాయతీ కార్మికులను పర్మినెంట్ చేయాలని, పని సమయంలో ప్రమాదాలు జరుగుతున్నా వారికి గ్రామ పంచాయతీ కార్మికులకు వేతనంతో కూడిన శెలవులు మంజూరు చేయాలని, పంచాయతీ కార్మికులకు పారిశుద్ధ్య పనులు కాకుండా పాలకులు అధికారులు వ్యక్తిగత పనులు చేహించకూడదని సూచించారు. ఈ కార్యక్రమంలో గుంటుపల్లి గ్రామ పంచాయతీ కార్మికులు పాల్గొన్నారు.

# వ్యవసాయాన్ని లాభసాటి చేయడమే ప్రభుత్వ లక్ష్యం



**మండల టీడీపీ అధ్యక్షుడు వేములకొండ వెంకటేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి లంకా నాగేశ్వరరావు**

**కవులూరులో రైతన్న మీకోసంలో 'పంచ సూత్రాల' అమలుపై రైతులకు అవగాహన**

**జి.కొండూరు మేజర్ న్యూస్ :** వ్యవసాయాన్ని లాభసాటి చేయడమే కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని జి.కొండూరు మండల తెదేపా అధ్యక్షుడు వేములకొండ వెంకటేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి లంకా నాగేశ్వరరావులు పేర్కొన్నారు. రైతన్న మీకోసం కార్యక్రమంలో భాగంగా పంచ సూత్రాల అమలుపై జి.కొండూరు మండలంలోని కవులూరులో మంగళవారం రైతులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సీఎం సందేశ లేఖ, కరపత్రాలను అందజేశారు. ఏపీఏఐఎంఎస్ యాప్ వినియోగంపై అన్నదాతలకు అవగాహన కల్పించి, రైతుల నుంచి సూచనలు, ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా తెదేపా మండల అధ్యక్షుడు వేములకొండ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాదు ఆదేశాల మేరకు జి.కొండూరు మండలంలో ఈ కార్యక్రమాన్ని అన్ని చోట్లా విస్తృతంగా చేపట్టినట్లు వెల్లడించారు. రైతులను సాంప్రదాయంగా వస్తున్న పంటల సాగును కాకుండా, నూతన, లాభదాయకమైన పంటల వైపు అడుగులు వేసేలా ప్రోత్సహించి, సిద్ధం చేయడమే ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యమన్నారు. మార్కెట్ ధరలు ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ, దానికి అనుగుణంగా పంట మార్పిడి చేసుకునే విధానంపై అవగాహన కల్పిస్తున్నామన్నారు. పంటల సాగులో ఎరువులు, పురుగు మందుల వాడకాన్ని తగ్గించడం వంటి వాటిపై కూడా రైతులను చైతన్య పర్చుతున్నట్లు వెల్లడించారు. ప్రకృతి వ్యవసాయం వైపు రైతులను మళ్లించేలా తగిన సూచనలు చేశారు. రైతు సేవ కేంద్రంలో పనిచేసే అగ్రికల్చర్ అసిస్టెంట్‌తో పాటు ఆరుగురు సచివాలయ సిబ్బంది ప్రతి ఇంటికి వెళ్లి రైతుల సమాచారాన్ని సేకరించారు. వ్యవసాయ శాఖ మైలవరం ఏడీఏ, ఏవో సూరిబాబు, గరికపాడు వ్యవసాయ క్షేత్ర శాస్త్రవేత్తలు, కవులూరు నాయకులు గొట్టుముక్కల వెంకటేశ్వరరావు, చెరుకూరి గంగాధరరావు, బొర్రా అశోక్, తాటికొండ భాస్కరరావు, గరిమెళ్ళ శ్రీనివాసరావు, బొర్రా భూ శంకరరావు, గరిమెళ్ళ కృష్ణ, భోగినేని సురేంద్ర, సునీల్, దొప్పల బుజ్జిబాబు, హనుమంతరావు, వ్యవసాయ శాఖ అధికారులు, ఎన్డీఏ కూటమి నేతలు, తదితరులు పాల్గొన్నారు.

# రైతుల సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యం

**ఎమ్మెల్యే కాగిత కృష్ణ ప్రసాద్**



**కృత్తివెన్ను నవంబర్ 25 మేజర్ న్యూస్ :** రైతుల సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని పెడన శాసన సభ్యులు కాగిత కృష్ణ ప్రసాద్ పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని కృత్తివెన్ను గ్రామంలో కూటమి ప్రభుత్వం చేపట్టిన రైతన్న సేవ కార్యక్రమాన్ని అటహాసంగా చేపట్టారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాగిత మాట్లాడుతూ రైతులకు అత్యాధునిక పద్ధతిలో వ్యవసాయం చేసేలా శిక్షణ ఇచ్చి ప్రోత్సహించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రైతులు పక్షాన వారికి కావలసిన సాంకేతిక పరిజ్ఞానాన్ని అందించేందుకు సిద్ధంగా ఉన్నారని పేర్కొన్నారు. నూతన పంటలు వంగడాలు తదితర అంశాలపై వ్యవసాయ, కూటమి నాయకులు ప్రతి ఇంటికి వెళ్లి వివరించడం జరుగుతుందన్నారు. నాట్లు వేసిన దగ్గర నుంచి పంట చేతికి వచ్చి మార్కెట్లో పంట అమ్ముడు పోయేవరకు ప్రభుత్వమే పూర్తి బాధ్యత తీసుకుంటుందని వివరించారు. రైతులకు అన్నివేళలా అందుబాటులో ఉంటూ ఇది మంచి ప్రభుత్వం అనిపించుకుంటామని తెలిపారు. ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు నష్టపోయిన ప్రతి రైతును ఆదుకునేందుకు కూటమి ప్రభుత్వం ఎప్పుడు ముందుంటుంది అన్నారు. ప్రతి రైతుకు ప్రభుత్వమే పూర్తి భరోసా కల్పిస్తుంది అన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ చైర్మన్ ఒడుగు తులసిరావు, డీసీ చైర్మెన్ నెక్కంటి విజయభాస్కరరావు, వైస్ డీసీ చైర్మన్ బొర్రా ఏడుకొండలు, శ్రీ దుర్గా పార్వతీ సమేత నాగేశ్వర స్వామి దేవాలయ ట్రస్ట్ చైర్మన్ చేకూరి వెంకటరావు, వ్యవసాయ అధికారులు ఎఫ్ డి ఓ జె సీతారామరాజు, డిహెచ్ఓ జ్యోతి, తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షుడు నాగిడి చెన్నకేశవరావు కూనసాని చిన్న, శ్రీనివాసరావు తెలుగుదేశం, జనసేన, బిజెపి పార్టీ నాయకులు కార్యకర్తలు రైతులు తదితరులు పాల్గొన్నారు.

# స్వామివారికి పట్టు వస్త్రాలు సమర్పించిన ఎమ్మెల్యే బుద్ధప్రసాద్ దంపతులు



**మోపిదేవి మేజర్ న్యూస్:** మోపిదేవి దేవస్థానం మరింత అభివృద్ధి చేసేందుకు మాస్టర్ ప్లాన్ సిద్ధం చేస్తున్నట్లు అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ తెలిపారు. ఉభయ తెలుగు రాష్ట్రాల్లో సుప్రసిద్ధ పుణ్యక్షేత్రంగా భాసిల్లుతూ భక్తులచే విశేష పూజలు అందుకుంటున్న మోపిదేవి శ్రీవల్లి దేవసేన సమేత శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారి దేవస్థానంలో మంగళవారం షష్టి కళ్యాణ మహోత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. దేవాదాయ శాఖ డిప్యూటీ కమిషనర్, చల్లపల్లి ఎస్టేట్ దేవాలయాల కార్యనిర్వాహణ అధికారి దాసరి శ్రీరామ వరప్రసాదరావు ఆధ్వర్యంలో చేపట్టిన ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా అవనిగడ్డ శాసనసభ్యులు మండలి బుద్ధప్రసాద్ -విజయలక్ష్మి దంపతులు విచ్చేశారు. వారికి దేవస్థానం వేద పండితులు ఘన స్వాగతం పలికారు. బ్రహ్మశ్రీ కొమ్మూరి ఫణి కుమార్ శర్మ, ప్రధాన అర్చకులు బుద్దు పవన్ కుమార్ శర్మ, ఘనాపాటి నౌడూరి విశ్వనాథ సుబ్రహ్మణ్య శర్మ, ముఖ్య అర్చక బుద్దు సతీష్ శర్మ, పలువురు పండితుల వేద మంత్రాల నడుమ బుద్ధప్రసాద్ – విజయలక్ష్మి దంపతులు, దాసరి శ్రీరామ వరప్రసాదరావులు స్వామి వారి పుట్టలో పాలు పోసి, పట్టు వస్త్రాలను స్వామి, అమ్మవార్లకు సమర్పించారు. ఈ సందర్భంగా వేద పండితులు స్వామివారిని పెండ్లి కుమారునిగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. షష్టి కల్యాణ మహోత్సవాలను పురస్కరించుకుని ఆలయంలో నిత్యం నిర్వహించే ఆర్జిత సేవలను మూడు రోజులపాటు తాత్కాలికంగా నిలిపివేయనున్నట్లు అధికారులు తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే బుద్ధప్రసాద్ చల్లపల్లి ఎస్టేట్ దేవాలయాల – 2026 క్యాలెండరు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ దిన దిన ప్రవర్ధమానంగా అభివృద్ధి చెందుతున్న మోపిదేవి పుణ్యక్షేత్రమునకు వచ్చే భక్తులకు సకల సౌకర్యాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. దేవస్థానం ఎదుట నిర్మిస్తున్న వసతి గదులు, షాపింగ్ కాంప్లెక్స్ త్వరలో ప్రారంభించనున్నట్లు తెలిపారు. భక్తుల కోసం నూతనంగా కేశ ఖండనశాల, టాయిలెట్స్ కాంప్లెక్స్ నిర్మిస్తున్నట్లు తెలిపారు. మరిన్ని సౌకర్యాలు కల్పించేందుకు ప్రణాళికతో కృషి చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో దేవస్థానం సూపరింటెండెంట్ అచ్యుత మధుసూధనరావు, దేవస్థానం అధికారులు కేశవ, కిషోర్, పయ్యావుల నాగరాజు, సీఐ కే.ఈశ్వరరావు, ఎస్ఐ పీ.గౌతమ్ కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

# "థా పేస్ ఆఫ్ ద ఫేస్ లెస్" సినిమాకు విశేష ఆదరణ





**విజయవాడ మేజర్ న్యూస్ :** నగరంలోని గాంధీనగర్ జయరాం థియేటర్‌లో ప్రదర్శించబడుతున్న థా పేస్ ఆఫ్ ద ఫేస్ లెస్ సినిమా ప్రేక్షకులను విశేషంగా అలరిస్తోందని సినిమా అభిమానలు తెలిపారు. సెయింట్ అన్స్ నర్సింగ్ కాలెజి విద్యార్ధులు, ప్రార్ధన మందిరాల ఫాదర్లు కలిసి మంగళవారం సినిమాను తిలకించారు. గిరిజన ప్రాంతాల్లో క్రిస్టియన్ మిషనరి సంస్థలు చేస్తున్న సేవలను సినిమాలో అద్భుతంగా చూపించారని వారు తెలిపారు. సిస్టర్ రాణీ యదార్ధ గాధను ద ఫేస్ ఆఫ్ ద ఫేస్లెస్ పేరిట తెరకిక్కించారని చెప్పారు. ఆమె జీవితాన్ని ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని కోరారు. ప్రజలందరూ సంతోషంగా ప్రేమ,క్షమ,గుణం కలిగి జీవించాలని, ఆమె జీవిత చరిత్ర ద్వారా ఇది తెలుస్తోందని చెప్పారు. ఈ సినిమా ప్రదర్శిస్తున్న థియేటర్ యజమానికి డిస్ట్రిబ్యూటర్ వారికి ఫాదర్లు సిస్టర్స్, కృతజ్ఞతలు తెలిపారు. ప్రదర్శనలో భాగంగా కృష్ణా జిల్లా, ఉభయ గోదావరి జిల్లాల్లో ప్రేక్షకుల కోసం ఉదయం ఆట, సాయంత్రం ఆట మాత్రమే ప్రదర్శిస్తున్నామని మురలీధర్, శాంతయ్య తెలిపారు.

# పులిగడ్డలో వైయస్సార్సీపీ కోటి సంతకాల సేకరణ

**అవనిగడ్డ, మేజర్ న్యూస్ :** రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ చేపట్టిన కోటి సంతకాల సేకరణ కార్య క్రమం ప్రతిష్టాత్మకంగా కొనసాగుతుంది. మంగళవారం మండల పరిధిలోని పులిగడ్డ ఏర్పాటుచేసిన కోటి సంత కాల సేకరణ కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే, వైఎస్ఆర్సీపీ నియోజకవర్గ సమన్వయకర్త, రాష్ట్ర రైతు విభాగం రీజనల్ వర్కింగ్ ప్రెసిడెంట్ సింహాద్రి రమేష్ బాబు హాజర య్యారు. ఈ సందర్భంగా కూరగాయల దుకాణాలు, ఫ్రూట్ షాపులు, ఆటో స్టాండ్, బస్ స్టాండ్ పరిసరాల్లో ప్రజలను వ్యక్తిగతంగా కలిసి సంతకాలు సేకరించారు. పేదలకు వైద్య విద్య అందుబాటులో ఉండాలన్న ముఖ్యోద్దేశంతో వైఎస్ఆర్ ప్రభుత్వం 17 మెడికల్ కాలేజీలను ప్రారంభించిన విషయాన్ని ఆయన గుర్తుచేశారు. అయితే ప్రస్తుత కూటమి ప్రభుత్వం పీపీపీ విధానాన్ని ప్రవేశపెట్టాలని చూస్తోందని, దీని వల్ల వైద్య విద్య పేదలకు అందనంత దూరమైపోతుందని ప్రజలకు వివరించారు. వైద్య విద్య ప్రైవేటీకరణను అడ్డుకోవాల్సిన అవసరం ఉందని ఈ సందర్భంగా ఆయన ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పులిగడ్డ సర్పంచ్



దాసరి విజయ్ కుమార్, వైస్ ఎంపీపీ పులిగడ్డ పిచ్చేశ్వరరావు, వైఎస్ఆర్సీపీ జిల్లా పంచాయతీరాజ్ విభాగం అధ్యక్షులు సింహాద్రి వెంకటేశ్వరరావు, మండల పార్టీ అధ్యక్షుడు రేపల్లె శ్రీనివాసరావు, రాష్ట్ర ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి నలుకుర్తి రమేష్, నియోజకవర్గ యువజన విభాగం అధ్యక్షుడు చింతలపూడి బాలు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

# రైతుల సంక్షేమమే ధ్యేయంగా రైతన్న మీకోసం

### జిల్లా వ్యవసాయ అధికారిణి పద్మావతి

**పమిడిముక్కల మేజర్ న్యూస్ :** మండలం పరిధిలోని గోపువానిపాలెం గ్రామంలో మంగళవారం ప్రభుత్వ "రైతన్న మీ కోసం" కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలో వ్యవసాయ అధికారులు పర్యటించి ఇంటింటికి తిరిగి రైతులకు పలు విషయాలపై అవగాహన కల్పించారు. కృష్ణాజిల్లా వ్యవసాయ అధికారిణి పద్మావతి ఈ కార్యక్రమంలో పాల్గొని ఇంటింటికి వెళ్లి రైతుల సమస్యలను స్వయంగా అడిగి తెలుసుకున్నారు. అలాగే రానున్న ఐదు సంవత్సరాలు కాలంలో రైతుల కోసం ప్రభుత్వం అమలు చేయబోతున్న కార్యక్రమాలను ఆమె వివరించారు. నీటి భద్రత, డిమాండ్ ఆధారిత పంటలు అగ్రిటెక్, ఫుడ్ ప్రాసెసింగ్, ప్రభుత్వ మద్దతు వంటి అంశాలపై ఆమె రైతులకు అవగాహన కల్పించారు. రైతు సంక్షేమమే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం కొనసాగుతోందని ఆమె ఈ సందర్భంగా తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ



శాఖ గన్నవరం సహాయ సంచాలకులు సునీల్, మండల వ్యవసాయ అధికారి గణేష్ రెడ్డి, స్థానిక వ్యవసాయ సిబ్బంది, పిపిసి సిబ్బంది పాల్గొన్నారు.

# వైభోగంగా శ్రీ కోదండరామ స్వామి ఆలయంలో శాంతి కళ్యాణం



**వత్సవాయిద, మేజర్ న్యూస్ :** మండలంలోని భీమవరం పరిధిలోగల శ్రీ కోదండరామ స్వామి ఆలయంలో మార్గ శుద్ధి పంచమి సందర్భంగా స్వామి సూర్యప్రకాష్ రావు ఆలయ ధర్మకర్త వారి కుమారులు శాంతి కళ్యాణంను వందలాది భక్తుల మధ్య నిర్వహించారు. దుర్భాకుల హరికృష్ణ, దుర్భాకుల వెంకటనారాయణ శర్మ అయిన వేద పండితులతో కళ్యాణము ఘనంగా నిర్వహించారు. ప్రతి సంవత్సరము మార్గశిర శు ద్ధ పంచమి రోజున శ్రీ కోదండరామ స్వామి ఆలయంలో శాంతి కళ్యాణం అంగరంగ వైభోగంగా సన్నాయి మేళం మధ్య వేద మంత్రాలతో మనంగా నిర్వహిస్తారు. ఇందులో భాగంగా శుక్రవారం మార్గశిర శుద్ధ పంచమి కావడముతో స్వామి శ్రీనివాస్, లక్ష్మి దంపతులు పీటల మీద కూర్చొని ఈ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఆలయ ధర్మకర్త స్వామి సూర్య ప్రకాష్ కుటుంబీకులు సుమారు 100 సంవత్సరాల క్రితం ఈ దేవాలయాన్ని నిర్మించినట్లు అలాగే ఈ స్వామివారికి సుమారు ఐదు ఎకరాల పొలము ఉన్నట్లుగా దానిపై వచ్చే ఆదాతో స్వామి వారికి దూప దీప నైవేద్యం కొరకు అలాగే దేవాలయంలో అనేక మౌలిక సదుపాయాలు కల్పించడంలో ఉ పయోగిస్తున్నట్లుగా వారు తెలిపారు. ప్రస్తుత తరుణంలో సుమారు 50సం.ల నుండి స్వామి సూర్య ప్రకాష్ అధ్యక్షతన ఈ దేవాలయంలో అనేక కార్యక్రమాలు నిర్వహిస్తూ భక్తుల మన్ననలు పొందుతున్నారు. అలాగే శుక్రవారం మార్గశిర శుద్ధ వంచమి శాంతి కళ్యాణ మహోత్సవానికి వందలాది మంది భక్తులు పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. అలాగే 800 మందికి అన్నదాన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కుటుంబ సభ్యులు స్వామి సావిత్రమ్మ, వెంకటేశ్వర్లు, నీరజ కుమారి, నందీప్, సౌజన్య, ఆరదీప్, శ్రీనివాస్ రావు, లక్ష్మి, సనత్, వాసవి, ఆరవ వసనందన్, శ్రీహరి, ఇందు కుమారి, సాయి ప్రకాష్, శివ కుమార్, వాసవి, వెంకటేశ్వరరావు, మీనాక్షి యాదా కృష్ణకుమారి, ఆకులు పుల్లారావు, ఉదయలక్ష్మి, బొగ్గారపు వెంకటాద్రి, శ్రీదేవి వంగవేటి శ్రీనివాసరావు, జ్యోతి, జయిన రామ గోవిందు, కవిత, మనవాళ్లు, మనవరాళ్లు, బంధుమిత్రులు అలాగే భీమవరం పెద్దరాజు, చిన్న రాజు, దేవులపల్లి దేవీ శ్వరరావు, పాశం పుల్లయ్య, కంమతం శీను, హరిబాబు, ఆవుల బాబు, రొయ్యల వీరస్వామి, గ్రామ ప్రజలు, భక్తులు పాల్గొన్నారు.



## అశ్వరావు పాలెంలో రైతన్నా మీకోసం ప్రారంభించిన ఏఎంసి చైర్మన్ కొల్లూరి

**అవనిగడ్డ, మేజర్ న్యూస్ :** వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చే లక్ష్యంతో కూటమి ప్రభుత్వం ప్రారంభించిన రైతన్నా మీకోసం కార్యక్రమాన్ని దివి మార్కెట్ కమిటీ చైర్మన్ కొల్లూరి వెంకటేశ్వరరావు ప్రారంభించారు. మంగళవారం మండల పరిధిలోని అశ్వరావు పాలెం గ్రామంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం రైతులకు మేలు చేకూర్చే విధంగా పాలన అందిస్తుందని దీనిలో భాగంగానే కూటమి ప్రభుత్వం చేపట్టిన 'రైతన్నా.. మీకోసం' కార్యక్రమం ద్వారాప్రభుత్వం రైతులకు అందిస్తున్న వివిధ సంక్షేమ పథకాలను రైతులకు వివరించారు. అనంతరం ప్రచార కర పత్రాలను అన్నదాతలకు అందించారు. ఈ కార్యక్రమంలో దివి వ్యవసాయ మార్కెట్ కమిటీ సెక్రటరీ శ్రీనివాసరావు, వ్యవసాయ శాఖ ఏఓ శుభ హారిక, అశ్వారావుపాలెం నీటి సంఘాల అధ్యక్షులు దాసినేని శ్రీనివాసరావు,గ్రామ మాజీ సర్పంచ్ కొండవీటి మధు పార్టీ నేతలు దాసినేని సాంబయ్య,రేపల్లె నాగబాబు,కొండవీటి రవి గ్రామ రైతులు తదితరులు పాల్గొన్నారు.

## ఇరువురికి సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందించిన ఎమ్మెల్యే



**పమిడిముక్కల మేజర్ న్యూస్ :** మండల పరిధిలోని ఐనపూరు గ్రామంలో ముఖ్యమంత్రి సహాయనిధి నుండి ఇరువురికి ఆర్థిక సహాయం మంజూరు కాగా పామర్రు శాసనసభ్యులు వర్ల కుమార్ రాజా లబ్ధిదారులకు అందజేశారు. గ్రామానికి చెందిన వెణుతురుమిల్లి జయ వెంకట సాయి కి 41,084 రూపాయలు, కొండా బాపిరెడ్డికి 25 వేల రూపాయల వంతున ఆర్థిక సహాయం మంజూరు కాగా ఆ చెక్కులను కుమార్ రాజా స్వయంగా లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే కుమార్ రాజాతో పాటు మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు రాజులపాటి శ్రీనివాసరావు, పార్టీ సీనియర్ నాయకులు జక్కా శ్రీనివాసరావు, పలువురు స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## రైతు సేవా కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసిన ఎమ్మెల్యే



**తోట్లవల్లూరు మేజర్ న్యూస్ :** మండల పరిధిలోని వల్లూరుపాలెం గ్రామంలో గల రైతు సేవా కేంద్రాన్ని పామర్రు శాసనసభ్యులు వర్ల కుమార్ రాజా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అక్కడ ఉన్న రికార్డులను తనిఖీ చేసి రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా చూడాలని సిబ్బందికి సూచించారు. ఈ సందర్భంగా రైతు సేవ కేంద్రంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. రైతులు కూడా ధాన్యాన్ని ఆరబెట్టుకోవడం ద్వారా ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరకు ధాన్యాన్ని విక్రయించుకోవాలని సూచించారు. ఇప్పటికే ధాన్యం కొనుగోలుకు సంబంధించి గోనె సంచులు సిద్ధంగా ఉన్నాయని, అలాగే రవాణాకు జిపిఎస్ పరికరం అమర్చి ట్రాక్టర్లను కూడా సిద్ధంగా ఉంచామని తెలిపారు. కావున రైతులు ఎవరూ అధైర్య పడవలసిన అవసరం లేదని, పండిన ప్రతి గింజను ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని రైతులకు హామీ ఇచ్చారు. రైతులు తొందరపడి అమ్ముకోకుండా మద్దతు ధరకు అమ్ముకునేలా తగు చర్యలు తీసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే కుమార్ రాజాతో పాటు పార్టీ నాయకులు చింతపల్లి వెంకటేశ్వరరావు, పలువురు రైతులు, తదితరులు పాల్గొన్నారు.

## తహసీల్దార్ కార్యాలయాన్ని సందర్శించిన ఎమ్మెల్యే



జగ్గయ్యపేట, నవంబర్ 25, మేజర్ న్యూస్ : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సూచనల మేరకు రాష్ట్రవ్యాప్తంగా ప్రజా సేవా సంస్థల పనితీరును బలోపేతం చేయడం కోసం శాసనసభ్యులు ప్రభుత్వ కార్యాలయాలు, ఆసుపత్రులు, విద్యాసంస్థలు, సంబంధిత శాఖలను పర్యవేక్షించాలని ఆదేశాలు జారీ చేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో జగ్గయ్యపేట శాసనసభ్యులు శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య) మంగళవారం ఉదయం స్థానిక నాయకులతో కలిసి జగ్గయ్యపేట తహసీల్దార్ కార్యాలయాన్ని సందర్శించారు. ఈ సందర్శన సందర్భంగా తహసీల్దార్ కార్యాలయంలో వివిధ రెవెన్యూ అంశాలపై అధికారులు, సిబ్బందితో చర్చించి ప్రజలకు మెరుగైన, వేగవంతమైన సేవలు అందించే విధానంపై సూచనలు ఇచ్చారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రత్యక్షంగా సమీక్షించి వాటి పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమంలో కట్టా వెంకట నరసింహారావు, యానాల గోపీచంద్, కానూరి కిషోర్, దోగుపర్తి విష్ణు, గుమ్మ వెంకటేష్, వివిధ హోదాలలో ఉన్న కూటమి నాయకులు రైతులు తదితరులు పాల్గొన్నారు.

## పలువురికి సీఎం సహాయనిధి చెక్కుల అందజేత



తోట్లవల్లూరు మేజర్ న్యూస్ : మండల పరిధిలోని పలు గ్రామాలలోని లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి మంజూరైన ఆర్థిక సహాయం చెక్కులను పామర్రు శాసనసభ్యులు వర్ల కుమార్ రాజా స్వయంగా లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి అందజేశారు. వల్లూరుపాలెం గ్రామంలో యార్లగడ్డ మురళీకృష్ణకు 50 వేల రూపాయలు, కంచర్ల వెంకటేశ్వరరావు కు 53,795 రూపాయలు, దేవరపల్లి గ్రామంలో ప్రొద్దుటూరి అక్కవాణి కి 40 వేల రూపాయలు, ఐలూరు గ్రామంలో వీరంకి రాంబాబు కు 30 వేల రూపాయలు, కొప్పరాజు రమాదేవికి 25 వేల రూపాయలు వంతున ఆర్థిక సహాయం మంజూరు కాగా ఆ చెక్కులను కుమార్ రాజా లబ్ధిదారులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం, జనసేన పార్టీలకు చెందిన పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## గొంతు కేన్సర్‌తో బాధపడుతున్న బాలికకు ఆర్థిక సాయం



హనుమాన్ జంక్షన్ మేజర్ న్యూస్: బాపులపాడు మండలం పెరికీడు గ్రామానికి చెందిన బాలిక ఆనారోగ్యంతో బాధపడుతుండగా తనవంతు ఆర్థికసాయం అందించి పాస్టర్ మానవత్వాన్ని చాటారు. పెరికీడు గ్రామానికి చెందిన అబ్బూరి రెడియ్య 16 ఏళ్ళ కుమార్తె అబ్బూరి కృపావరం గొంతు కేన్సర్ తో బాధపడుతుండగా వైద్య చికిత్స నిమిత్తం ఆర్థికసాయాన్ని మంగళవారం పాస్టర్ పరమట జోసఫ్బర్ట్ అందజేశారు.సహాయం అందించిన బిషప్ రాబర్ట్‌ను గ్రామస్తులు అభినందించారు. ఈ కార్యక్రమంలో నక్కా బాబు, రెడ్డియ్య తదితరులు పాల్గొన్నారు.

## గన్నవరం డిపోకు హనుమాన్ జంక్షన్ శ్రీ హాస్పిటల్ నుంచి ప్రథమ చికిత్స కిట్ల పంపిణీ



గన్నవరం, నవంబర్ 25, మేజర్ న్యూస్ : ఏపీఎస్ఆర్టీసీ గన్నవరం డిపోలో విధుల్లో ఉన్న ప్రతి కండక్టర్ వద్ద, ప్రతి బస్సులో ప్రథమ చికిత్స సామగ్రి అందుబాటులో ఉండేలా హనుమాన్ జంక్షన్ బస్ స్టేషన్ ఇన్‌గేట్ ఎదురుగా ఉన్న శ్రీ హాస్పిటల్ వైద్యుడు డాక్టర్ ఉదయగిరి సాగర్ మొత్తం 150 ప్రథమ చికిత్స కిట్లు లను గన్నవరం డిపో మేనేజర్ శివాజీ కి అందజేశారు. ఈ కిట్లలో ప్రథమ చికిత్సకు అవసరమైన బ్యాండేజీలు, బర్నాల్, ఆయింట్మెంట్, డెట్టాల్ బాటిల్, బ్లేడ్, ప్లాస్టర్ సహా మొత్తం 9 రకాల ఔషధాలు, వస్తువులు ఉన్నాయి. ఫస్ట్ ఎయిడ్ కిట్లను అందజేసినందుకు డాక్టర్ ఉదయగిరి సాగర్ కి డిపో మేనేజర్, బస్ స్టేషన్ కంట్రోలర్లు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సూపర్వైజర్ వాసు, విశ్రాంత ఉద్యోగులు సుబ్రహ్మణ్యం, నాగేశ్వర రెడ్డి పాల్గొన్నారు.

# నూతనంగా నిర్మించిన అంగన్‌వాడి కేంద్ర భవనం ప్రారంభం





తోట్లవల్లూరు మేజర్ న్యూస్ : మండల పరిధిలోని రొయ్యూరు గ్రామంలో నూతనంగా నిర్మించబడిన అంగన్ వాడి కేంద్రంను పామర్రు శాసనసభ్యులు వర్ల కుమార్ రాజా ప్రారంభించారు. జాతీయ ఉపాధి హామీ పథకం నిధులు 5 లక్షల రూపాయలు, జిల్లా పరిషత్ నిధులు 5 లక్షల రూపాయల వ్యయంతో నిర్మించిన ఈ భవనాన్ని ఆయన ప్రారంభించారు అంతేకాక గ్రామానికి చెందిన ఉప్పులూరు గోపాలకృష్ణ పి-4 పథకం కింద 1,05,000 రూపాయలు ఈ భవన నిర్మాణానికి ఆర్థిక సహాయం అందించారు. మహిళా శిశు సంక్షేమ శాఖ పామర్రు ప్రాజెక్టు పరిధిలోని దేవరపల్లి సెక్టార్‌లో రొయ్యూరు-2 అంగన్ వాడి కేంద్రానికి నూతన భవన ప్రారంభోత్సవం జరుపుకోవడం ఎంతో ఆనందకరంగా ఉందని ఈ సందర్భంగా ఎమ్మెల్యే కుమార్ రాజా పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోనికి వచ్చిన తర్వాత చిన్నారుల భవిష్యత్తును తీర్చిదిద్దే లక్ష్యంతో విద్యకు అధిక ప్రాధాన్యతను ఇస్తూ పలు సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టిందని అన్నారు ఈ సంక్షేమ పథకాలను ప్రతి ఒక్కరు వినియోగించుకోవడం ద్వారా ఆర్థికంగా లబ్ది పొందాలని సూచించారు. అలాగే తన దాతృత్వంతో ముందుకు వచ్చిన గోపాలకృష్ణను ఈ సందర్భంగా ఎమ్మెల్యే కుమార్ రాజా అభినందించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ నిమ్మగడ్డ ప్రభుదాసు, పిఎసిఎస్ అధ్యక్షులు ఈడే రేణుక రావు, కళ్లెం వంశీకృష్ణారెడ్డి, తహసీల్దార్ ఎం.కుసుమకుమారి, ఎంపీడీవో రవికాంత్, పలువురు గ్రామస్తులు, అంగన్ వాడి సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా అంగన్ వాడి కార్యకర్తలు ఎమ్మెల్యే కుమార్ రాజాను ఘనంగా సత్కరించారు.

# ప్రతి విద్యార్థి తమకు ఉన్న రక్షణ చట్టాల గురించి తప్పక తెలుసుకోవాలి

### డీఎస్పీ సి.హెచ్ రాజా





మచిలీపట్నం మేజర్ న్యూస్ : జిల్లా ఎస్పీ వి.విద్యాసాగర్ నాయుడు, ఆదేశాల మేరకు ఈరోజు బందరు డిఎస్పి సిహెచ్ రాజా మచిలీపట్నంలోగల పద్మావతి మహిళా జూనియర్ కళాశాలలో అవగాహన సదస్సు నిర్వహించి సమాజంలో జరిగే నేరాలు, మాదక ద్రవ్యాల వినియోగం వల్ల జరిగే నష్టాలు, సైబర్ మోసాలు, రహదారి భద్రత నియమాలు పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థి దశలో చదువుతోపాటు సమాజంలో చోటు చేసుకుంటున్న ప్రతి సంఘటన గూర్చి విపులంగా తెలుసుకోవాలి మరీ ముఖ్యంగా ఆడపిల్లలు సమాజంలో ఎదుర్కొంటున్న సమస్యలను ఏ విధంగా అధిగమించాలి పోలీస్ వారి నుండి ఏ విధంగా సహాయం పొందాలి మొదలైన ప్రతి అంశం గురించి తెలుసుకోవాలని డిఎస్పీ తెలిపారు. ఫోన్ వినియోగించే సమయంలో కూడా అప్రమత్తంగా ఉండాలని మాయ మాటలు, ప్రలోభాలకు గురి చేసే వారి చేతుల్లో చిక్కుకోవద్దని మన భవిష్యత్తు మనకు ప్రధానమని మనపై నమ్మకాన్ని పెట్టుకొని జీవిస్తున్న తల్లిదండ్రుల ఆశలను నెరవేర్చాలని తెలిపారు. మనం చదువుకునే విద్యాసంస్థకు, మన కుటుంబానికి మంచి పేరు తీసుకువచ్చేలా వ్యవహరించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ముఖ్యంగా బాలికలకు ఏవైనా బ్యాడ్ టచ్ సంఘటనలు ఎదురైనపుడు ఎలా స్పందించాలి, సైబర్ మోసాలకు బలికాకుండా ఎలా జాగ్రత్తలు తీసుకోవాలి, మాదక ద్రవ్యాల వినియోగం వల్ల కలిగే దుష్ఫలితాలు, వాటి వల్ల వ్యక్తిగత, సామాజిక జీవితంపై కలిగే ప్రభావాలను గురించి విద్యార్థులకు వివరించారు. ఈ అవగాహన కార్యక్రమం ద్వారా విద్యార్థుల్లో భద్రతపై అవగాహన పెంపొందించి, ఏవైనా అనుమానాస్పద ఘటనలు ఎదురైతే ఏ విధంగా పోలీసు వారికి సమాచారం 112, 1930కాల్ ద్వారా అందించాలి, సహాయం పొందాలి అని, మహిళల భద్రత కోసం ఏర్పాటు చేసిన శక్తి టీం వివరాలు, వారి విధులు వివరించారు.

## డ్రైనేజీలలో చెత్తాచెదారం వెయ్యకండి..

**ప్రజలకు సూచించిన టిడిపి రాష్ట్ర సీనియర్ నాయకులు గొర్రెపాటి గోపీచంద్.**



మచిలీపట్నం మేజర్ న్యూస్ : డ్రైనేజీలలో ఎటువంటి చెత్తా చెదారాలు వేయకుండా చూసుకోవలసిన బాధ్యత మనందరిపై ఉందని టిడిపి రాష్ట్ర సీనియర్ నాయకులు గోపీచంద్ అన్నారు. ప్రజల సహకారంతోనే నగరం పచ్చదనం, పరిశుభ్రత సాధ్యపడుతుందని అన్నారు. సబ్ జైల్ పూడిక పనులను తెలుగు దేశం పార్టీ ఇంచార్జ్ ఫణి కుమార్ తో కలిసి ఆయన మంగళవారం పరిశీలించారు. సబ్ జైల్ డ్రైన్‌లో గత కొంతకాలంగా ప్లాస్టిక్ ట్రేలు ఇరుక్కుపోయి డ్రైనేజీ పారుదల లేక చుట్టుపక్కల ప్రజలు ఇబ్బందులకు గురయ్యారని అన్నారు.దుర్వాసన వల్ల, దోమలతో ఇబ్బందులు పడుతున్నట్లు తెలిపారు. నగరంలోని డ్రైనేజీలలో ఎటువంటి చెత్త వేయకుండా ప్రజలు వ్యాపారస్తులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ముఖ్యంగా రోడ్డు ప్రక్కన వ్యాపారం చేసుకునే చిరు వ్యాపారులు కోసివేసిన పండ్ల గెలలు, ప్లాస్టిక్ ట్రేలు వంటివి డ్రైనేజీలలోవ వేయవద్దన్నారు. శానిటేషన్ సిబ్బందికి చెత్తను అందజేయాలని తెలిపారు. 45వ డివిజన్ తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్, పి. వి. ఫణి కుమార్ తో పాటుగా శానిటేషన్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. డ్రైనేజీలలో నీటిపారుదల సక్రమంగా లేకపోతే దోమలు నిల్వ ఉండి అనారోగ్యాల బారిన పడే అవకాశం ఉందని, ప్రతి ఒక్కరూ డ్రైనేజీలలో ఎటువంటి చెత్తాచెదారాలు వేయవద్దని గోపీచంద్ కోరారు. ఈ కార్యక్రమంలో 45వ డివిజన్ ఇంచార్జ్ పి వీ ఫణి కుమార్, శానిటేషన్ సిబ్బంది పాల్గొన్నారు.




## ప్రజాధర్బార్‌కి పెరుగుతున్న ప్రజా స్పందన

**టీడీపీ యువ నాయకులు గద్దె క్రాంతి కుమార్**

విజయవాడ తూర్పు, మేజర్ న్యూస్: కూటమి ప్రభుత్వం చెప్పటిన ప్రజా ధర్బార్ కార్యక్రమాలకు ప్రజల నుంచి విశేష స్పందన వస్తుందని దానికి కారణం ప్రభుత్వం పై వారికున్న నమ్మకమేనని గద్దె క్రాంతి కుమార్ తెలిపారు. మంగళవారం ఉదయం 8డివిజన్ గాయత్రి నగర్ లో నిర్వహించిన ప్రజా దర్బార్ కార్యక్రమంలో టీడీపీ యువ నాయకులు గద్దె క్రాంతి కుమార్ పాల్గొని ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా గద్దె క్రాంతి కుమార్ మాట్లాడుతూ రాష్ట్రంలో మౌలిక సదుపాయాల కల్పనకు కూటమి ప్రభుత్వం తొలి ప్రాధాన్యమిస్తోందన్నారు. గత ఐదేళ్ల ప్రజలు ఎలా పోయినా మాకెందుకు అన్నట్లు వైకాపా పాలన సాగిందని, కూటమి ప్రభుత్వం వచ్చిన రోజు నుంచి ప్రజల ఆశయాలకు అనుగుణంగా నడచుకుంటున్నామన్నారు. అధికారంలోకి రాగానే రాష్ట్ర వ్యాప్తంగా గుంతలు లేని రోడ్ల సాకారం చేసే దిశగా అడుగులు వేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ చెన్నుపాటి ఉషారాణి, కొత్తపల్లి రమేష్, మల్లెల రామకృష్ణ, నారు రామారావు, గద్దె రంగారావు, నరకనపల్లి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు..

# చేతుల పరిశుభ్రత ఆరోగ్య విద్యపై అవగాహన



**జగ్గయ్యపేట, నవంబర్ 25, మేజర్ న్యూస్ :** డెటాల్ బనేగా స్వస్థ్ ఇండియా వారి సహకారంతో పెనుగంచిప్రోలు మండలంలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల్లో చేతుల పరిశుభ్రత ఆరోగ్య విద్య పై అవగాహన పెంపొందించేం దుకు పాఠశాలలకు పంపిణీ చేయనున్న గోడ పత్రికలు సోప్‌కిట్స్, ఉపాధ్యా యుల కరదీపికలను మంగళవారం జగ్గయ్యపేట శాసన సభ్యులు శ్రీరాం రాజగోపాల్ నివాసంలో ఎమ్మెల్యే చేతుల మీదుగా ఆవిష్కరణ చేయడం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పాఠశాల దశలోనే పిల్లల్లో ఆరోగ్యంపై సరైన అవగాహన పెంపొందించటం అత్యంత అవసరం అని అన్నారు. ముఖ్యంగా చేతుల పరిశుభ్రత వంటి సాధారణ అలవాట్లు పిల్లలను అనేక వ్యాధుల నుండి దూరంగా ఉంచుతాయి అని అన్నారు. ఈ దిశగా డెటాల్ బనేగా స్వస్థ్ ఇండియా చేపడుతున్న కార్యక్రమం అభినందనీయ మన్నారు. పెనుగంచిప్రోలు మండలంలోని ప్రతి ప్రభుత్వ పాఠశాలలో ఈ గోడ పత్రికలు, సోప్‌కిట్స్, ఉపాధ్యాయుల కరదీపికలు ఉపయోగించి విద్యార్థులకు నిరంతరంగా ఆరోగ్య విద్య అందించాలి. పరిశుభ్రమైన అలవాట్లు మాత్రమే కాదు, పాఠశాలల పరిశుభ్రత, తాగునీటి సదుపాయాల నిర్వహణపైనా ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటామని అన్నారు. పిల్లల ఆరోగ్యం అంటే గ్రామ-మండల ఆరోగ్యం. పిల్లలు ఆరోగ్యంగా ఉంటేనే మన ప్రాంతం అభివృద్ధి సాధ్యం. ప్రభుత్వం తీసుకొస్తున్న ప్రతి మంచి కార్యక్రమానికి ప్రజలు, ఉపాధ్యాయులు, సంస్థలు కలిసికట్టుగా పనిచేస్తే మరింత మంచి ఫలితాలు వస్తాయి అని అన్నారు. ఈ సందర్భంగా ఎంఈఓ డి రవీందర్ మాట్లాడుతూ పెనుగంచిప్రోలు మండలం ఆస్పిరేషనల్ బ్లాక్ ప్రోగ్రామ్ పరిధిలో ఉండడంతో, మండలంలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు చేతుల పరిశు భ్రత, పరిసరాల పరిశుభ్రత, వ్యక్తిగత పరిశుభ్రత పై అవగాహన కల్పించే కార్యక్రమాలు నిరంతరం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అదనంగా, విద్యార్థుల్లో సృజనాత్మకతను పెంపొందించేందుకు చిత్రలేఖనం, సాంస్కృతిక కార్యక్రమాలను కూడా నిర్వహిస్తున్నామని, ఈ కార్యక్రమాల ద్వారా విద్యార్థులు మరింత ప్రోత్సాహంతో పాల్గొని, ఆరోగ్యకరమైన అలవాటులను అలవరుచుకుంటున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డిబిఎస్ఐ ప్రాజెక్ట్ మేనేజర్ డాక్టర్ టి. లక్ష్మీ, కర్నాటి రఘు, క్లస్టర్ కోఆర్డినేటర్ పి. సైదులు తదితరులు పాల్గొన్నారు.

# వీధి కుక్కలకు ఆహారం పెట్టు ప్రదేశము మరిన్ని పెంచండి





**విజయవాడ కార్పొరేషన్, మేజర్ న్యూస్ :** నగర పరిధిలోని వీధికుక్కలకు ఆహారం పెట్టు ప్రదేశములు మరిన్ని పెంచమని విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర హెచ్. యం. అన్నారు. మంగళవారం ఉదయం తన పర్యటనలో భాగంగా టిక్కిల్ రోడ్డు, మొగల్రాజపురం, మదర్ తెరిసా జంక్షన్, పిన్నమనేని పాలి క్లినిక్ రోడ్డు, లయోలా కాలేజ్ రోడ్డు, ఈఎస్ఐ హాస్పిటల్ రోడ్డు, వెటర్నరీ కాలనీ, గులాబీ తోట ప్రాంతాలన్నీ పర్యటించి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు వీధి కుక్కలకు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఆహారం పెట్టు ప్రదేశాలను నగర పరిధిలోని మరిన్ని పెంచాలని, జంతు ప్రేమికుల సౌజన్యంతో ఈ ప్రదేశాలను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తుండాలని అధికారులను ఆదేశించారు. గుణదల ఈఎస్ఐ హాస్పిటల్ రోడ్డు వద్ద జరుగుతున్న అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేయాలని, ఇంజనీర్లు అందరూ తమ తమ పరిధిలో ఉన్న అభివృద్ధి పనులను కాంట్రాక్ట్ లో ఉన్న గడువు లో పూర్తి చేయించేటట్టు చర్యలు తీసుకోవాలని, అనుకున్న సమయానికి పనులన్నీ పూర్తి అయ్యేటట్టు చూసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ పర్యటనలో చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ కె.అర్జునరావు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ జి.సామ్రాజ్యం, అసిస్టెంట్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ గోపాలకృష్ణ నాయక్, సిబ్బంది పాల్గొన్నారు.

# రోడ్లు సమస్యలపై ఆర్ అండ్ బి మంత్రిని కలిసిన ఎమ్మెల్యే తాతయ్య



**జగ్గయ్యపేట, నవంబర్ 25, మేజర్ న్యూస్ :** రహదారులు-వంతెనల అభివృద్ధికి రూ.170.51 కోట్లు మంజూరు చేయాలని ఆర్అండ్‌బీ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి కి సెక్రటేరియట్‌లో ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య) ప్రతిపాద నలు అందజేయడం జరిగింది. జగ్గయ్యపేట నియోజకవర్గంలో గత ఏడాది సెప్టెంబర్ 2024, ఆగస్టు 2025లో కురిసిన భారీ వర్షాలు, వరదల ప్రభావంతో దెబ్బతిన్న రహదారులు, వంతెనల పునర్నిర్మాణం - అభివృద్ధి కోసం మొత్తం రూ.170.51 కోట్ల విలువైన ప్రతిపాదనలను రాష్ట్ర ఆర్అండ్‌బీ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి కి సెక్రటేరియట్‌లో ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని), ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య తో కలిసి అందజేశానని జగ్గయ్యపేట ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య) తెలిపారు. ఖమ్మం జిల్లా, తెలంగాణ రాష్ట్రం నుండి శ్రీ లక్ష్మీ తిరుపతమ్మ అమ్మవారి దేవాలయం (పెనుగంచిప్రోలు), ముక్త్యాల శ్రీ భవాని ముక్తేశ్వరస్వామి దేవాలయం వంటి ప్రముఖ దేవాలయాలకు వేలాదిగా భక్తులు వచ్చే మార్గాలు కావడంతో, ఈ రహదారులపై ట్రాఫిక్ ఎప్పుడూ అధికంగా ఉంటుందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. వరదల కారణంగా రోడ్లు దెబ్బతిని ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆయన వెల్లడించారు. మేజర్ డిస్టిక్ రోడ్స్ రోడ్ల అభివృద్ధికి రూ.12.01 కోట్లు, మొత్తం 8 ప్రధాన మేజర్ డిస్టిక్ రోడ్స్ రహదారుల మరమ్మత్తులు, బీటీ పనుల కోసం రూ.1201 లక్షలు (రూ.12.01 కోట్లు) అంచనా వ్యయం ప్రతిపాదించారు. ఇందులో ప్రధాన రహదారులు: జొన్నలగడ్డ రోడ్ - అనిగండ్లపాడు, అనిగండ్లపాడు - కాకరవాయి, వత్సవాయి - వేమవరం, శివాపురం - అనిగండ్లపాడు, జొన్నలగడ్డ రోడ్ - దాములూరు, అనసాగరం - పెనుగంచిప్రోలు. స్టేట్ హైవేస్ రోడ్లు అండ్ వంతెనలకు రూ.158.50 కోట్లు. రాష్ట్ర ప్రధాన రహదారులు, కీలక వంతెనల పునర్నిర్మాణానికి మొత్తం రూ.15850 లక్షలు (రూ.158.50 కోట్లు) ప్రతిపాదించారు. నేషనల్ హై వే -9 నుండి మక్కపేట - పెనుగంచిప్రోలు మార్గం అభివృద్ధికి: రూ.3.50 కోట్లు, జగ్గయ్యపేట - వైరా రహదారి కిమీ 14/8 వద్ద హై లెవల్ వంతెన పునర్నిర్మాణం: రూ.125 కోట్లు, జగ్గయ్యపేట - ముక్త్యాల రహదారి కిమీ 2/8 వద్ద వంతెన పునర్నిర్మాణం: రూ.30 కోట్లు, ఈ రహదారులు భక్తులు, రోజువారీ ప్రయాణికులు, వ్యవసాయ-వాణిజ్య రవాణాకు ఎంతో కీలకం కావడంతో, పనులు అత్యవసరమని ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ తాతయ్య మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి ని అభ్యర్థించారు. దీనికి మంత్రి సానుకూలంగా స్పందించి, ప్రతిపాదనలు ప్రభుత్వం ముందు ఉంచుతానని హామీ ఇచ్చినట్లు ఎమ్మెల్యే తెలిపారు.

## ఆయుష్ ఆయుర్వేద ఆసుపత్రిలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించిన డైరెక్టర్ కె.దినేష్ కుమార్



**హనుమాన్ జంక్షన్ మేజర్ న్యూస్:** ప్రజలకు ఆయుర్వేద వైద్యాన్ని ఉచిత వివిధ రకాల వైద్యసేవల ద్వారా అందు బాటులోకి తీసుకు వచ్చేలా కార్యాచరణ రూపొందించడం జరి గిందని ఆయుష్ డైరెక్టర్ కె.దినేష్ కుమార్ అన్నారు. బాపులపాడు మం డలం కానుమోలు గ్రామంలోని ప్రభుత్వ ఆయుష్ ఆయుర్వేద ఆసుపత్రిలో ఆయన మంగళవారం ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. రికార్డులను తనిఖీ చేసి వైద్య చికిత్సకు వచ్చిన వారితో ఆసుపత్రి ద్వారా అందుతున్న సేవల గురించి అడిగి తెలుసు కున్నారు. ఆసుపత్రి ప్రాంగణంలో డాక్టర్ వాహిని ప్రత్యేకశ్రద్ధతో పెంచుతున్న వివిధ ఔషధమొక్కలను, మందులను, ఆవరణ శుభ్రతను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేసి అభినందిం చారు. గ్రామస్తులతో మాట్లాడుతూ పంచకర్మ ట్రీట్మెంటు కు అవసరమైన థెరపిస్టులను నియమి స్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల రాష్ట్ర వ్యాప్తంగా ఆయుర్వేద ఆసుపత్రులకు మందులు అందజేయడం జరిగిందని, ప్రజలకు అందుబాటులో ఉన్నాయా, ఆయుష్ శాఖ ద్వారా ప్రజలకు అందుతున్న సేవల తదితర విషయాలను పరిశీలన చేసేందుకు తనిఖీ చేస్తున్నట్లు ఆయన తెలిపారు. ప్రభుత్వం ద్వారా ఆయుష్శాఖకు ఈ సం వత్సరం రూ.165 కోట్ల నిధులు మంజూరు చేయడం జరిగిందని, త్వరలో రాష్ట్రంలో రెండు అయ ర్వేద కళాశాలలు, యునాని కళాశాల, 50 బెడ్లతో ఇంటిగ్రేటెడ్ ఆయుర్వేద ఆసుపత్రులు రాబోతున్నాయన్నారు. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు ప్రజలకు ఆయుష్శాఖ ద్వారా సేవలను విస్తృతం చేసేలా కార్యాచరణ చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డైరెక్టర్ ధనుంజయ్, రీజనల్ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ కుమార్, పీఎంయు టీం సభ్యులు,మాగంటి సురేష్, కొండపల్లి హరిబాబు,రహీం, క్రాంతి తేజ,రమేష్ తదితర గ్రామస్తులు పాల్గొన్నారు.

## రెవెన్యూ సిబ్బందితో సమీక్ష సమావేశం



**విజయవాడ కార్పొరేషన్, మేజర్ న్యూస్ :** విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర హెచ్ఎం ఆదేశాల మేరకు మంగళవారం ఉదయం ప్రధాన కార్యాల యంలో గల నూతన భవనంలోని మీటిం గ్ హాల్లో రెవెన్యూ సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు డిప్యూటీ కమిషనర్ (రెవెన్యూ) జి. సృజన. ఈ సమావేశంలో నగర పరిధిలో గల ఆస్తి పన్ను, ఖాళీ స్థలాల పన్ను, వాటర్ చార్జీలు, డ్రైనేజీ చార్జీలు ప్రతి ఇంటికి వెళ్లి, ప్రజలకు వారి పన్నువకాయలను తెలియపరిచి పన్ను వసూలు చెయ్యా లని అన్నారు. నగరపాలక సంస్థ పరిధిలో గల అన్ని ఖాళీ స్థలాలు, ఖాళీ స్థలాలుగానే ఉన్నాయా లేదా వాటి పైన ఇల్లు నిర్మించారా, ఒకవేళ ఇళ్లను నిర్మిస్తే వాటికి తగ్గట్టుగా ఖాళీ స్థలాల పన్నును ఇంటి పన్నుకి మార్చాలని, ఇంటి పన్నులు ఉన్న అసెస్మెంట్లకు నగరపాలక సంస్థ జారీ చేస్తున్న డి మాండ్ కు తగ్గట్టుగా ఉందా లేదా, ఒకవేళ అదనముగా రూములు నిర్మిం చిన, ఫ్లోర్లు నిర్మించిన, ఆ మార్పుకు తగ్గట్టుగా పన్నును మార్చాలని, రెసిడెన్ని యల్ గా ఉన్న ఆస్తి కమర్షియల్ గా మారితే దానికి తగ్గట్టుగా పన్ను వేయా లని అన్నారు. అడ్మిన్ సెక్రటరీలు ఫీల్డ్ వెరిఫికేషన్ చేసి కచ్చితంగా పూర్తి చేయాలన్నారు. అలాగే ప్రజలు కూడా సిబ్బంది తమ వద్దకు వచ్చినప్పుడు సహకరించాలని, పన్నులను సకాలంలో చెల్లించి నగరాభివృద్ధికి తోడ్పడాలని కోరారు. ఈ సమావేశంలో అసిస్టెంట్ కమిషనర్లు హెలెన్, ఏ యూ బి శర్మ, డి.శ్రీనివాస్, రెవెన్యూ ఆఫీసర్లు, ఇన్స్పెక్టర్లు, పాల్గొన్నారు.

## డ్రైనేజీ పై ఉన్న ఆక్రమణలు తొలగింపు

### విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర

**విజయవాడ కార్పొరేషన్, మేజర్ న్యూస్ :** విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర ఆదేశాల మేరకు వర్షపునీరు రోడ్డుపైన నిలవ ఉండకుండా డ్రైనేజీ వ్యవస్థ లో ఎటువంటి లోపాలు లేకుండా తీసుకుంటున్న చర్యల్లో భాగంగా, స్క్యూ బ్రిడ్జ్ వద్ద సర్వీస్ రోడ్లో గల డ్రైనేజ్ పై ఉన్న ఆక్రమణలను, కృష్ణలంకలో ఉన్న అనధికార కట్టడాలను పట్టణ ప్రణాళిక సిబ్బంది తొలగించారు. ఈ సందర్భంగా కమిషనర్ ధ్యానచంద్ర మాట్లాడుతూ నగర పరిధి లో గల డ్రైనేజ్ పైనున్న ఆక్రమణలు, అనధికార కట్టడాలు తొలగిస్తున్నామని, ప్రత్యేకంగా వర్షపు నీరు రోడ్డుపైన నిల్వ ఉండకుండా డ్రైనేజ్ వ్యవస్థలో ఎటువంటి లోపాలు లేకుండా తీసుకుంటున్న చర్యలు లో భాగంగా డ్రైనేజ్ పై ఆక్రమణలను తొలగిస్తున్నామని అన్నారు. కావున ప్రజలు దీన్ని గమనించాలని, అనుమతి లేనిదే భవనాలు నిర్మించరాదని, ఆగస్టు 31, 2025 కల్లా ఏమైనా అనధికార భవనాలు నిర్మించినచో వెంటనే బిల్డింగ్ పినలైజేషన్ స్కీం ద్వారా దరఖాస్తు చేసుకొని అనుమతి పొందాలని కమిషనర్ అన్నారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ సిటీ ప్లానర్ మోహన్ బాబు, సిబ్బంది పాల్గొన్నారు.


# విద్య, వైద్య అవసరాలు ఉన్నవారికి బెరాకా మినిస్ట్రీస్ ఆపన్న హస్తం

**సహాయార్థులకు "మేమున్నాం" అంటున్న బెరాకా మినిస్ట్రీస్**

**పేద విద్యార్థుల, విద్య, వైద్యానికి రూ.11,10,000ల చేయూత**

**డాక్టర్ బి.ఎస్.కిరణ్‌పాల్ సేవల్ని కొనియాడిన ప్రముఖులు**







**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** కాస్త సాయం చేసి, అతిగా ప్రచారం చేసుకుంటున్న ఈ రోజుల్లో, ఎక్కువ ప్రచార ఆర్భాటాలకు పోకుండా, బెరాకా మినిస్ట్రీస్ సంస్థ స్వచ్ఛందంగా సాయం అందించడానికి "మేము అండగా ఉన్నాం" అంటూ చేయూత నిస్తోంది. ఎవరికి ఏ కష్టం వచ్చినా తోడు, నీడలా నిలుస్తోంది. దీనులకు, అవసరార్థులకు, విద్య, వైద్య అవసరాలు ఉన్నవారికి, ఆపన్న హస్తం అందిస్తూ బెరాకా మినిస్ట్రీస్ అధినేత డాక్టర్ బి ఎస్ కిరణ్ పాల్ తమ సంస్థ ద్వారా చేస్తున్న సేవలు వెలకట్టలేనివి. బెరాకా మినిస్ట్రీస్ సంస్థ ద్వారా డాక్టర్ బి ఎస్ కిరణ్ పాల్ చేస్తున్న సేవలు వెలకట్టలేనివని టిడిపి సీనియర్ నాయకులు గొర్రెపాటి గోపీచంద్ అన్నారు. సమాజంలో ఆర్థికంగా వెనుకబడిన వారికి, వికలాంగులకు, నిరుపేద విద్యార్థులకు, సహాయార్థులకు "మేమున్నాం" అంటూ బెరాకా మినిస్ట్రీస్ అధినేత కిరణ్ పాల్ అండదండలు అందిస్తున్నారు. ఈడేపల్లి పంచాయతీరాజ్ కాలనీలో బెరాకా మినిస్ట్రీస్ కార్యాలయంలో మంగళవారం బెరాకా మినిస్ట్రీస్ ఆధ్వర్యంలో 38 మంది పేద విద్యార్థుల విద్యకు, వైద్యానికి సంబంధించి మొత్తం 11,10,000/టి రూపాయలను చెక్కుల రూపంలో అందజేశారు.

ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన టిడిపి రాష్ట్ర సీనియర్ నాయకులు గోపీచంద్ మాట్లాడుతూ బెరాకా మినిస్ట్రీస్ అధినేత కిరణ్ పాల్ కుల, మతాలకు అతీతంగా పేదరికంలో ఉన్నవారిని గుర్తించి, వారి సంస్థ ద్వారా చేయూత అందించడం అభినందనీయమన్నారు. వారు చేసే సేవలు అనన్య సామాన్యమని అన్నారు. మానవసేవే మాధవసేవ అని భావించి తమ బెరాకా మినిస్ట్రీస్ ద్వారా కిరణ్ పాల్ ఎంతోమంది నిరుపేదలకు, ఆర్థిక సహాయం అందిస్తూ వారందరికీ ఆశాకిరణంలా, వారి గుండె గదుల్లో కొలువై ఉంటున్నారన్నారు. పేద విద్యార్థుల చదువు కోసం సహకరిస్తూ, నిరుపేదల వైద్య ఖర్చుల నిమిత్తం ఆపన హస్తం అందించడానికి తానున్నానంటూ కిరణ్ పాల్ పేదవారికి అండగా నిలబడటం సామాన్యమైన విషయం కాదన్నారు. సమాజంలో ఎందరికో ఆదర్శంగా ఆయన నిలుస్తున్నారన్నారు. వారి వద్ద ఎన్నో వ్యక్తిత్వ వికాస విషయాలు తెలుసుకోవచ్చన్నారు. పేద విద్యార్థుల ఫీజుల కొరకు మొత్తం 11 లక్షల పదివేల రూపాయల భారీ సాయం చేయడం అంటే సామాన్యమైన విషయం కాదన్నారు. ఇలాంటి వారికి భగవంతుడి ఆశీస్సులు మెండుగా ఉంటాయన్నారు. సాయం అందుకున్న వారి కళ్ళల్లో బెరాకా మినిస్ట్రీస్ సంస్థ పట్ల కృతజ్ఞతా భావం కొట్టొచ్చినట్లు కనిపిస్తోందని, అని అన్నారు. ఇప్పటికే ఎన్నో సేవా కార్యక్రమాల్లో తమ సంస్థ ద్వారా ఎంతో పేరు ప్రఖ్యాతులు గడించిన వీరు రాబోయే రోజుల్లో నిరుపేదలకు మరిన్ని సహాయ సహకారాలు అందించాలన్నారు. తెలుగుదేశం పార్టీ నగర అధ్యక్షుడు, లోగిశెట్టి వెంకటస్వామి, 11వ డివిజన్ ఇంచార్జ్, చిన్నం శివనాగేశ్వరరావు, 45వ డివిజన్ ఇంచార్జ్ పి. వి. ఫణి కుమార్, బెరాకా మినిస్ట్రీస్ ప్రతినిధులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# ఎలక్ట్రానిక్ కాటాలను తనిఖీచేసిన అధికారుల తనిఖీలు



**చల్లపల్లి, మేజర్ న్యూస్ :** చల్లపల్లి మండలంలో తూనికల కొలతల శాఖ అధికారులు మం గళవారం తనిఖీలు చేపట్టారు. గ్రామాల్లో వరికోతలు ముమ్మరంగా జరుగుతున్న నేపథ్యంలో ధాన్యం విక్రయ సమయాల్లో కాటాల్లో మోసాలను నిరోధించే క్రమంలో అధికారులు తనిఖీలు చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో ముఠా మేస్త్రిలు వేసే కాటాల్లో తేడాలుంటున్నట్లు రైతాంగం నుంచీ ఫిర్యాదులు వస్తున్న నేపథ్యంలో తనిఖీలు చేసి ఎలక్ట్రానిక్ కాటాలను సరిచూశారు. చల్లపల్లి మండలం యార్లగడ్డ, వక్కలగడ్డ, చల్లపల్లి తదితర గ్రామాల్లో ముఠా మేస్త్రీలు వేసే కాటాలు, రైస్ మిల్లులు, ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో కాటాలను తూనికల కొలతల శాఖ అధికారులు తనిఖీ చేశారు. కాటాల్లో ఎలాంటి తేడాలను గమనించలేదని అధికారులు తెలిపారు. ఈ కార్య క్రమంలో జిల్లా తూనికల కొలతల శాఖ ఇన్స్పెక్టర్ ఈశ్వరరావు, పీడీఎస్ డీటీ శ్రీనివాసరావు, చల్లపల్లి ఏవో కె. మురళీకృష్ణ, సొసైటీల సీఈవోలు, వీఆర్వోలు, అధికారులు, రైతులు పాల్గొన్నారు.

# సమష్టి కృషితోనే సమగ్రాభివృద్ధి సాధ్యం..

**జిల్లా అభివృద్ధిలో ఉద్యోగుల పాత్ర కీలకం : ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ**



**ఎన్టీఆర్ జిల్లా బ్యూరో, నవంబర్ 25, మేజర్ న్యూస్ :** సమష్టి కృషితోనే సమగ్రాభివృద్ధి సాధ్యమవుతుందని జిల్లా అభివృద్ధిలో ఉద్యోగులు అందిస్తున్న సహకారం మరువలేనిదని ప్రజలకు పారదర్శకమైన సేవలందించి ప్రభుత్వ లక్ష్యాలను సాధించడంలో భాగస్వాములు కావాలని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ అన్నారు. ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్‌గా పదవీ బాధ్యతలు చేపట్టి ఏడాది పూర్తిచేసుకున్న సందర్భంగా ఏపీ ఎన్‌జీజీవో అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు డి.సత్యనారాయణ రెడ్డి, సహాధ్యక్షులు వేమూరి ప్రసాద్, కార్యదర్శి డి.రమేష్, నగర అధ్యక్షులు సీవీఆర్ ప్రసాద్ ఆధ్వర్యంలో జిల్లా, నగర కార్యవర్గ సభ్యులు మంగళవారం జిల్లా కలెక్టర్ విడిది కార్యాలయంలో జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశను మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ జిల్లాలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు విజయవంతం కావడంలో ఉద్యోగులు అందిస్తున్న సహకారం మరువలేనిదన్నారు. ప్రభుత్వం ప్రజల భాగస్వామ్యంతో సుస్థిరాభివృద్ధి సాంధించే దిశగా అడుగులు వేస్తుందన్నారు. జిల్లాలో వ్యవసాయ పారిశ్రామిక పర్యాటక సేవారంగాల్లో వార్షికవృద్ధి లక్ష్య సాధనకు సమష్టి కృషి అవసరమన్నారు. స్వర్ణాంధ్ర, వికసిత్ భారత్ లక్ష్యాలను సాధించేందుకు మరింత కృషిచేయాలన్నారు. సంక్షేమానికి, అభివృద్ధికి సమ ప్రాధాన్యమిస్తూ రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో నడిపించాలన్న రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యాన్ని నెరవేర్చడంలో ఉద్యోగుల భాగస్వామ్యం కీలకమన్నారు. జిల్లాలో ఏడాదిగా సాధించిన విజయాలు అధికారులు, ఉద్యోగుల సమన్వయంతో సాధ్యపడిందని జిల్లా కలెక్టర్ తెలిపారు. ఉద్యోగులకు ఎదురయ్యే సమస్యలను తమ దృష్టికి తీసుకొస్తే వాటిని త్వరితగిన పరిష్కరించడంలో ఎప్పుడూ ముందుంటానని భరోసా కల్పించారు. ఏపీ ఎన్జీవో అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు డిఎస్ఎన్ రెడ్డి మాట్లాడుతూ జిల్లాను అన్ని రంగాల్లో అభివృద్ధి వైపు పరుగులు పెట్టిస్తూ ప్రజల కలెక్టర్‌గా పేరు తెచ్చుకోవడం ఉద్యోగులకు గర్వకారణం అన్నారు. ఏ పి ఎన్జిజిఒ రాష్ట అధ్యక్షులు విద్యాసాగర్ నేతృత్వంలో ఉద్యోగులు పారదర్శకత, నిబద్ధతతో సేవలందిస్తూ జిల్లా యంత్రాంగం అప్పగించిన బాధ్యతలను పూర్తిస్థాయిలో నిర్వర్తించేందుకు ఉద్యోగులూ ఎల్లప్పుడు సిద్దంగా ఉంటారన్నారు. జిల్లా కలెక్టర్‌ను కలిసిన వారిలో ఏపీ ఎన్జీవో అసోసియేషన్ జిల్లా కార్యవర్గ సభ్యులు వి.వి. ప్రసాద్, పి.రమేష్, బి.సతీష్ కుమార్, ఎం.రాజుబాబు, డి.విశ్వనాథ్, బీవీ రమణ, రామకృష్ణ, మహిళా ప్రతినిధి కె.శివలీల, నగర కార్యవర్గ సభ్యులు సీవీఆర్ ప్రసాద్, ఎస్ కే నజీరుద్దీన్, వి.రాజశేఖర్, దిలీప్ కుమార్, కె.మధుసూదనరావు, శ్రీనివాసరావు, విజయశ్రీ, సాగర్, రవి తదితరులు పాల్గొన్నారు.



## పచ్చదనం- పరిశుభ్రతకు డ్వాక్రా మహిళల సైతం భాగస్వాములు కావాలి

**ఎంపీడీఓ సుహాసిని**




**మొవ్వ మేజర్ న్యూస్:** పరిశుభ్రమైన, పచ్చని గ్రామాలుగా తీర్చిదిద్దటానికి గ్రామాలలోని డ్వాక్రా మహిళలు సైతం తమ వంతు సహకారం అందించి భాగస్వాములు కావాలని ఎంపీడీఓ దయాల సుహాసిని పిలుపునిచ్చారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో వెలుగు వి.ఓలకు,డ్వాక్రాసంఘాలనుంచి ప్రతి గ్రామంలో ఎంపిక చేసిన ఇద్దరు సభ్యులకు, క్లీన్ అండ్ గ్రీన్ పై ఒక రోజు శిక్షణా కార్యక్రమాలు నిర్వహించారు. పర్యావరణ పరిరక్షించడం పచ్చదనం పెంపొందించడానికి గ్రామాల్లోని డ్వాక్రా మహిళా సభ్యులకి అవగాహన కల్పించి వారి సహకారం పొందాలని ఆమె వివరించారు. వాతావరణ మార్పుల సవాళ్లను పరిష్కరించడం కోసం పర్యావరణ స్థిరత్వాన్ని పెంపొందించడానికి కృషి సలపాల్సిన ఆవశ్యకత ఉందని అభిప్రాయపడ్డారు. ఈ సందర్భంగా సుస్థిర నగరాలు, సమాజాలు పై వెలుగు సభ్యులకు అవగాహన కల్పించారు. ఎంపీపీ కొండేటి. ఇందిర అధ్యక్షత వహించిన ఈకార్యక్రమంలో మండలంలోని 21 గ్రామాల నుంచి ఎంపిక చేసిన ఇద్దరు వి.ఓ.ఏ.లు, ప్రతి పంచాయతీ నుంచి పాల్గొన్న డ్వాక్రా సభ్యులకు మండల పరిషత్ కార్యాలయం సమీపంలోని గల చెత్త నుండి సంపద సేకరణ కేంద్రంలో అవగాహనతో కూడిన శిక్షణ ఇచ్చారు.

**విలేకరులు కావలెను**

నేటి దినపత్రిక సూర్య నందు నందిగామ టౌన్, నందిగామ రూరల్, కంచికచర్ల, వీరులపాడు, చందర్లపాడు మండలాల్లో పని చేయుటకు విలేకరులు కావలెను.

ఇట్లు ఎన్.వెంకట్, ఎన్టీఆర్ - కృష్ణా బ్యూరో
ఫోన్ : 9642 980 999